
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
ఆదివారం, 1 డిసెంబరు 2024
5

ఇంతి.. ఇంతింతై..

- ఆర్థిక సాధికారత దిశగా పొదుపు సంఘాల మహిళలు
- మధిరలో ఇందిర డెయిరీతో ఆరంభం..
- జిల్లాలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అడుగులు
- ఆర్టీసీకి అద్దె బస్సులు ఇచ్చేదిశగా ఆలోచనలు...
- కొత్త పుంతలు తొక్కుతున్న డ్వాక్రా సంఘాలు



7

నేడు మంత్రి తుమ్మల రాక

మూడు రోజులపాటు పర్యటన



ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం నుంచి మూడు రోజులపాటు జిల్లాలో పర్యటించనున్నారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లో ఉదయం 7.30కి బయల్దేరి 10.30కి ఖమ్మంలోని చెరుకూరి గార్డెన్స్‌కు చేరుకుని అక్కడ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత 12గంటలకు కల్లూరులో ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి 9గంటలకు ఖమ్మం నగరంలో పంపింగ్‌వెల్ రోడ్డులో ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొంటారు. సోమవారం ఉదయం 9.30కి రఘునాథపాలెం మండలం శివాయిగూడెంలో, 10 గంటలకు ఉదయ్‌నగర్‌లో, 10.30కి మంచుకొండలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. 3వ తేదీన ఉదయం 11గంటలకు వైఎస్సార్ కాలనీలో సీసీ రోడ్లకు, 11.30కి ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో శ్రీరాంనగర్‌లో రైతుబజార్‌కు శంకుస్థాపన చేయనున్నారు.

నాలుగో విడత రైతు రుణమాఫీ

- **జిల్లాలో 17,852 మంది రైతులకు రూ.154.03 కోట్లు**



ఖమ్మం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రేషన్ కార్డులతో కుటుంబాలు అనుసంధానం కాని వారికి, అర్హత ఉన్నప్పటికీ రుణమాఫీ కానివారికి శనివారం రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ వర్తింపచేసింది. ఖమ్మం జిల్లాకు సంబంధించి 17,852మంది రైతులకు రూ.154.03కోట్లు రుణమాఫీ చేశారు. మొదటి విడతలో రూ.లక్షలోపు రూ.57,695 మంది రైతులకు రూ.258.31కోట్లు, రెండో విడతగా రూ.లక్షా50వేల వరకు ఉన్నవారిలో 33,942 మందికి రూ.262.50కోట్లు, మూడో విడతగా రూ.2లక్షలలోపు 23,546 మందికి రూ.245.85కోట్లు రుణమాఫీ జరిగింది. కాగా కుటుంబ నిర్ధారణకాక పెండింగ్‌లో జిల్లాలో 55,871 మంది రైతులను గుర్తించగా వ్యవసాయశాఖ 42,456 కుటుంబాలను సర్వే చేసి కుటుంబ నిర్ధారణ నిర్ణయించింది. అయితే ఇందులో రూ.2లక్షలపైగా రుణాలున్నవారు కూడా అధికంగా ఉన్నారు. కాగా కుటుంబ నిర్ధారణ కానివారిలో నాలుగో విడతగా 17,852మంది రైతులకు రూ.154.03కోట్లు మాఫీ జరిగింది. మిగిలినవి రూ.2లక్షల పైన రుణమాఫీ కావాల్సి ఉంది.

జిల్లా పశు సంవర్ధక అధికారిగా
వెంకటనారాయణ



ఖమ్మం వ్యవసాయం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పశు సంవర్ధక అధికారిగా వెంకట నారాయణ కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. శనివారం ఆయన ఈ మేరకు బాధ్యతలు స్వీకరించారు. వెంకటనారాయణ హన్మకొండ లో పశు సంవర్ధకశాఖ అధికారిగా పని చేస్తుండగా ప్రభుత్వం ఖమ్మం జిల్లా అదనపు బాధ్యతలు అప్పగించింది. కాగా ఖమ్మంలో పనిచేస్తున్న జిల్లా అధికారి వేణు మనోహర్ శనివారం పదవీ విరమణ పొందారు. కార్యాలయ సిబ్బంది కొత్త అధికారికి స్వాగతం పలికారు. పదవీ విరమణ పొందిన వేణు మనోహర్‌కు వీడ్కోలు పలికారు.

'ప్రజాపాలన విజయోత్సవాల'కు నియోజకవర్గ ఇన్‌-చార్జిల ఖరారు

ఖమ్మం మార్కెట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): 'ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు- రైతు పండుగ నియోజకవర్గ ఇన్‌చార్జిలను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ మేరకు శనివారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఖమ్మం నియోజకవర్గానికి డి. రవీంద్రనాయక్, పాలేరుకు కొండేటి మల్లయ్య, వైరాకు పున్నా కైలాష్‌నేత, మధిరకు నాయుడు సత్యనారాయణ, సత్తుపల్లికి హర్షవర్ధన్‌రెడ్డి, కొత్తగూడెంకు దొమ్మాటి సాంబయ్య, అశ్వారావుపేటకు ఈవీ శ్రీనివాసరావు, భద్రాచలంకు వెన్న శ్రీకాంత్‌రెడ్డి, పినపాకకు గుత్తా అమిత్ రెడ్డి, ఇల్లందుకు భీమగాని సౌజన్యగౌడ్‌ను నియమించారు.

కల్లలైన కలలు



- అమెరికాలో దుండగుల కాల్పుల్లో ఖమ్మం వాసి నూకారపు సాయితేజ మృతి
- విస్కాన్సిన్ స్టేట్‌లో షాపింగ్‌మాల్‌లో ఘటన
- డబ్బులు ఇచ్చినా వదలని కిరాతకులు
- ఐదు నెలల క్రితమే యూఎస్ వెళ్లిన సాయితేజ
- కొడుకు మృతితో తల్లిదండ్రుల కన్నీరుమున్నీరు

ఖమ్మంక్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తమ కుమారుడు అగ్రరాజ్యంలో ఉన్నత చదువులు పూర్తిచేసి కుటుంబాన్ని వృద్ధిలోకి తెస్తాడనుకున్న ఆ తల్లిదండ్రుల కలలు కల్లలయ్యాయి. అమెరికాలో ఎంబీఏ చదవాలని వెళ్లిన ఓ విద్యార్థి ఐదు నెలల్లోనే ఇద్దరు దుండగులు జరిపిన కాల్పుల్లో మృతి చెందాడు. అమెరికాలోని విస్కాన్సిన్ రాష్ట్రంలో గుర్తుతెలియని దుండగులు జరిగిన కాల్పుల్లో ఖమ్మం నగరానికి చెందిన నూకారపు సాయితేజ(22) అనే విద్యార్థి మృతి చెందాడు.(భారత కాలమాన ప్రకారం)శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంటకు జరిగిన ఈ ఘటనకు సంబంధించి మృతుడి తండ్రి, కుటుంబ సభ్యుల తెలిపిన వివరాలు ప్రకారం.. ఖమ్మం నగరశివారులోని



సాయితేజ తండ్రి కోటేశ్వరరావును పరామర్శిస్తున్న బంధువులు

60వ డివిజన్ రామన్నపేటకు చెందిన నుకారపు కోటేశ్వరరావు, వాణిల దంపతులు రాపర్తినగర్‌లో నివాసం ఉంటున్నారు. కోటేశ్వరరావు సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు ఒక కుమారుడు సాయితేజ (22), కుమార్తె స్ఫూర్తిప్రియ ఉన్నారు. ప్రియ రెండేళ్ల క్రితం అమెరికాలోని న్యూజెర్సీకి వెళ్లి చదువు పూర్తి చేసి అక్కడే ఉద్యోగం చేస్తోంది. కుమారుడు సాయితేజ ఖమ్మంలోని ఓ కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేసి ఎంబీఏ చదివేందుకు జూన్ 23న అమెరికా వెళ్లాడు. చికాగో రాష్ట్ర సమీపంలోని విస్కాన్సిన్ స్టేట్‌లో ఖమ్మం జిల్లాకు చెందిన ఇద్దరు స్నేహితులతో కలిసి రూమ్‌లో ఉంటున్నాడు. అక్కడికి సమీప



గత జూన్ 23న ఎయిర్‌పోర్టులో తల్లిదండ్రులతో సాయితేజ (ఫైల్)

ప్రాంతంలో తమ బంధువులు కూడా ఉండడంతో ఇక్కడ అతడి కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉన్నారు. విస్కాన్సిన్ రాష్ట్రంలో కాన్కోర్డియా యూనివర్సిటీలో సాయితేజ ఎంబీఏ చదువుతూ సమీపంలోని మిల్వాకీ షాపింగ్ మాల్‌లో స్టోర్ మేనేజర్‌గా పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో మాల్‌లో విధులు నిర్వహిస్తుండగా శుక్రవారం అర్ధరాత్రి (భారత కాలమానం ప్రకారం)గుర్తుతెలియని ఇద్దరు దుండగులు డబ్బు కోసం మాల్‌లో కాల్పులు జరిపారు. అక్కడ కౌంటర్‌లో డబ్బు తీసుకుని సాయితేజ వద్దకు వచ్చి (మిగతా 6వ పేజీలో)

వ్యవసాయ పంట ఉత్పత్తుల రవాణాలో వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు చెల్లించకుండా రైతుల పేర్లతో వ్యవసాయ ఉత్పత్తులను రైట్ రైట్ అంటూ తరలించుకుపోతున్నారు. మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ఉమ్మడి జిల్లానుంచి పెద్ద ఎత్తున పత్తి, వరిధాన్యం తరలిపోతోంది. కొన్నింటికి మార్కెటింగ్ శాఖ సెస్ కట్టి సేల్స్‌ట్యాక్స్ చెల్లించి తీసుకెళుతుండగా, మరికొన్ని రైతుల పేర్లతోనే అనుమతులు పొంది తీసుకుపోతున్నారు. దీంతో మార్కెటింగ్ శాఖ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.



అడ్డదారిలో రైట్ రైట్



- పొరుగు రాష్ట్రాలకు తరలిపోతున్న పత్తి, ధాన్యం
- రైతుల పేర్లతో వే బిల్స్ రాయించి సేల్స్‌ట్యాక్స్ ఎగ్గొడుతున్న వ్యాపారులు
- చెక్‌పోస్టుల వద్ద పెద్దఎత్తున మామూళ్ల దందా
- మార్కెటింగ్ శాఖ ఆదాయానికి కోట్లల్లో గండి
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం
- రూ.63 కోట్లకు గాను రూ.31 కోట్లే వసూలు

ఖమ్మం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది పత్తి, ధాన్యం భారీగా సాగు అయింది. 3లక్షలపైగా ఎకరాల్లో పత్తి, మరో 3 లక్షల ఎకరాల్లో వరి వేశారు. ఖమ్మంతో పాటు పాలేరు, వైరా, కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో ఉత్పత్తి అయ్యే పత్తి దారం నాణ్యతగా ఉండడంతో మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, ఏపీలోని గుంటూరుకు వ్యాపారులు ఇక్కడ పత్తిని అధికంగా ఇష్టపడుతున్నారు. దీంతో జూలూరుపాడుతోపాటు కారేపల్లి, ఇల్లెందు, టేకులపల్లి, కామేపల్లి తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున పత్తికొనుగోలు జరుగుతోంది. వ్యవసాయ మార్కెట్లకంటే మండల కేంద్రాల్లోనే వ్యాపారులు కొందరు ఏజెంట్లను పెట్టి నేరుగా పత్తి కొనుగోలు సాగిస్తున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలున్నా పత్తి రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద పెట్టుబడికి సొమ్ములు తెచ్చి, తిరిగి వారికే పత్తిని అమ్ముకునే ఆనవాయితీ ఎన్నో ఏళ్లనుంచి వస్తుంది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కొంతమంది వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు ఉమ్మడి జిల్లాలోని పత్తిని కొనుగోలు చేసి తరలించుకుపోతున్నారు.

ప్రతిరోజు 50 నుంచి 100 లారీలపైగా పత్తి ఇతర రాష్ట్రాలకు తరలిపోతోంది. పత్తి వ్యాపారులు కొందరు రైతుల పేర్లతో వేబిల్స్ రాయించి చెక్‌పోస్టుల వద్ద మామూళ్లు ముట్టచెప్పి తరలించుకుపోతున్నారు. రూ.లక్షకు వెయ్యి చొప్పున మార్కెటింగ్ శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. నాలుగు శాతం సేల్స్ ట్యాక్స్ చెల్లించాలి. ఇటు మార్కెటింగ్ శాఖ.. అటు సేల్స్‌ట్యాక్స్ కలిపి రూ.లక్షకు రూ.5వేలు వ్యాపారులు చెల్లించాలి. అయితే రైతుల పేర్లతో తరలించుకుపోవడం వల్ల మార్కెటింగ్ శాఖకు నష్టం వాటిల్లుతోంది. ఇతర రాష్ట్రాల్లోని పత్తి

(మిగతా 6వ పేజీలో)

లక్ష్యం రూ.63 కోట్లు.. వసూలు రూ.31 కోట్లు

ఖమ్మం జిల్లా పరిధిలో 8 వ్యవసాయ మార్కెట్‌లు ఉండగా ఈ ఏడాది రూ.63.94 కోట్లు లక్ష్యం పెట్టుకోగా రూ.31.74 కోట్ల ఆదాయం లభించింది. ఇంకా నాలుగు నెలలే లక్ష్యానికి గడువు ఉంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పరిధిలో రూ.30 కోట్లు లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు 14.59 కోట్లు, మధిర మార్కెట్‌లో రూ.4.75 కోట్లు లక్ష్యంగా రూ.2.29 కోట్లు వసూలయ్యాయి. నేలకొండపల్లి మార్కెట్‌లో రూ.3.78 కోట్లకు 1.87 కోట్లు, కల్లూరు మార్కెట్‌లో రూ.5.67 కోట్లకు రూ.3.45 కోట్లు, వైరా మార్కెట్‌లో రూ.6.73 కోట్లకు రూ.4.14 కోట్లు, వేంసూరు మార్కెట్‌లో రూ.4.87 కోట్లకు 1.11 కోట్లు, సత్తుపల్లి మార్కెట్‌లో రూ.4.94 కోట్లకు రూ.2.94 కోట్లు, మద్దులపల్లి మార్కెట్‌లో రూ.3.15 కోట్లకు గాను రూ.1.31 కోట్ల ఆదాయం లభించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బూర్గంపాడు, దమ్మపేట, ఇల్లెందు, భద్రాచలం, కొత్తగూడెం, చర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీలుండగా ఈఏడాది రూ.21.71 కోట్లకుగాను రూ.10.42 కోట్ల ఆదాయం ఇప్పటి వరకు లభించింది.

యాసంగి యాక్షన్ ప్లాన్
సిద్ధం

- వరి వైపే రైతుల మొగ్గు
- ఈ సారి 3 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగు
- అవసరమైన ఎరువుల కోసం అంచనాల తయారీ

ఖమ్మం వ్యవసాయం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంట సీజన్ పూర్తవడంతో వ్యవసాయ శాఖ యాసంగిపై దృష్టి సారించింది. జిల్లాలో యాసంగి పంటల సాగుకు కార్యాచరణ ప్రణాళికను వ్యవసాయశాఖ ఖరారు చేసింది. యాసంగి సీజన్‌లో ఖమ్మం జిల్లాలో మొత్తం మూడు లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని అంచనా వేసింది. ఈ మేరకు అవసరమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు కసరత్తు ప్రారంభించింది. ఈ ఏడాది వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు జలాశయాలు, చెరువులు, కుంటల్లో నీరుసమృద్ధిగా చేరింది. ఈ నేపథ్యంలో భూగర్భ జలమట్టం (మిగతా 6వ పేజీలో)



ఇంటింటి కుటుంబ
సర్వే పూర్తి

- గ్రామీణ ప్రాంతంలో 108.36 శాతం
- పట్టణ ప్రాంతంలో 104.26 శాతం
- ఇప్పటి వరకు 70శాతం మేర ఆన్‌లైన్ లో నమోదు

6

ఆదమరిస్తే అంతే..



నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం

- చాపకింద నీరులా విస్తరిస్తున్న హెచ్‌ఐవీ/ఎయిడ్స్ మహమ్మారి
- హెచ్‌ఐవీ బాధితులు ఖమ్మం జిల్లాలో 17,199, భద్రాద్రి జిల్లాలో 14,718 మంది
- ప్రతినెలా సగటున 40 కేసుల నమోదు
- అవగాహన, చైతన్యంతోనే అడ్డుకట్ట
- సరైన మందులు తీసుకుంటే జీవన వ్యవధి పెరిగే అవకాశం

6

హెచ్‌ఐవీ/ఎయిడ్స్ మళ్లీ పంజా విసురుతోంది. ఒకరినుంచి మరొకరికి సోకే ఈ మహమ్మారి ఎంతకీ అదుపులోకి రావడం లేదు. ఉమ్మడి జిల్లాలో గత ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు *61,056* మందికి హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించగా *285*మందికి పాజిటివ్ వచ్చింది. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం *17,199* మంది హెచ్‌ఐవీ రోగులు ఉన్నారు. వారిలో ఇప్పటి వరకు *3,500* మంది మరణించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గతంతో పోల్చితే జిల్లాలో కేసుల సంఖ్య కొంత తగ్గినా వైరస్ వ్యాప్తి పూర్తిగా అదుపులో లేదని గణాంకాలు తెలుపుతున్నాయి. ఎయిడ్స్ విస్తరణలో దేశంలో తెలంగాణ రాష్ట్రం రెండో స్థానంలో ఉండగా, రాష్ట్రంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా *4*వ స్థానంలో ఉంది. మొదట హైదరాబాద్, రెండో స్థానంలో మహబూబ్‌నగర్ మూడోస్థానంలో రంగారెడ్డి జిల్లాలు ఉన్నాయి. హెచ్‌ఐవీ రోగుల కోసం ప్రభుత్వం ఉచితంగా మందులను పంపిణీ చేస్తోంది. ఒక్కో రోగికి కనీసం రూ. *10* వేల నుంచి రూ.*12*వేల విలువైన మందులు ఇస్తోంది. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ బోర్డు అధ్వర్యంలో ఉచితంగా ఖమ్మం జిల్లా ఆసుపత్రిలో ఈ మందులు అందజేస్తున్నారు. నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం (డిసెంబరు *1*) సందర్భంగా ఉమ్మడి జిల్లాలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ వ్యాప్తిపై ప్రత్యేక కథనం..

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం కలెక్టరేట్/భద్రాచలం

మరో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ

- వేంసూరు మండలం కల్లూరుగూడెంలో నిర్మాణానికి చర్యలు
- కొత్త ఏడాదిలో శంకుస్థాపనకు ఏర్పాట్లు
- ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో రెండో ఫ్యాక్టరీలు
- ఆయిల్‌పామ్ సాగు పెరుగుతుండటమే కారణం



సత్తుపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరిస్తున్న క్రమంలో మూడో ఆయిల్‌పామ్ కర్మాగారాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేటలో, దమ్మపేట మండలం అప్పారావుపేటలో రెండు కర్మాగారాలున్నాయి. తాజాగా కొత్త సంవత్సరంలో మరో ఆయిల్‌పామ్ కర్మాగారాన్ని ఏర్పాటు చేయనున్నారు. వేంసూరు మండలం కల్లూరుగూడెం గ్రామంలో కర్మాగారం ఏర్పాటు చేసేందుకు ఆయిల్‌ఫెడ్ రంగం సిద్ధం చేసింది. దీనికి సంబంధించినీ డీపీఆర్ ప్రభుత్వం ఆమోదించిన తరువాత ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన జరగనుంది. కల్లూరుగూడెంలో మూడేళ్ల క్రితం 42ఎకరాల భూమిని సేకరించి ఆయిల్‌ఫెడ్‌కు అధికారులు అప్పగించారు. ప్రతిపాదిత భూమి చుట్టూ ఫెన్సింగ్ నిర్మించారు.. మరో ఆరెకరాలు అప్రోచ్ రోడ్డుకోసం భూసేకరణ ప్రక్రియ సాగుతోంది.

60 టన్నుల సామర్థ్యం

కల్లూరుగూడెంలో గంటకు 60టన్నుల సామర్థ్యంలో ఫ్యాక్టరీ నిర్మించాలని ప్రతిపాదించారు. ఇప్పటికే అప్పారావుపేటలో 30టన్నులు, అశ్వారావుపేటలో 90 టన్నుల సామర్థ్యంతో కర్మాగారాలున్నాయి. మూడేళ్ల క్రితమే కర్మాగారం నిర్మాణం కోసం స్థలం సేకరించినప్పటికీ జిల్లాలో సాగుచేస్తున్న ఆయిల్‌పామ్ తోటలు పూర్తిస్థాయిలో దిగుబడి రాకపోవటంతో అప్పట్లో నిర్మాణం ముందుకు సాగలేదు. ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1.10లక్షల ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ సాగుచేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 30వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ విస్తరించి ఉంది. ఆయా తోటల నుంచి 80వేల టన్నుల ఆయిల్‌పామ్ పండు దిగుబడి వస్తోంది. దీనిలో 70 శాతం సత్తుపల్లి నియోజకవర్గం నుంచే దిగుబడి వస్తోంది. ప్రస్తుతం దిగుబడి వస్తున్న తోటల విస్తీర్ణం పెరగటంతో పాటు కర్మాగారం నిర్మాణం పూర్తయ్యే నాటికి దిగుబడి వచ్చే విస్తీర్ణం కూడా పెరగనుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని కర్మాగారం నిర్మాణం వెంటనే చేపట్టాలని ప్రభుత్వం బావిస్తోంది.

ప్రత్యేక దృష్టి

ఆయిల్‌పామ్‌పై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచటంతో దేశీయంగా గిట్టుబాటు ధర కూడా లభిస్తోంది. ఈ క్రమంలో సాంప్రదాయ పంటల నుంచి ఆయిల్‌పామ్ సాగువైపు దృష్టి సారించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులను ప్రోత్సహిస్తున్నారు. దీనితో పాటు రైతులకు ఆయిల్‌పామ్ మార్కెటింగ్‌లో ఇబ్బందులు కూడా లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ ఉండటంతో రైతులు కూడా ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెద్ద మొత్తంలో పెరిగితే భవిష్యత్తులో గెలల క్రషింగ్ ఇబ్బందులు లేకుండా కర్మాగారాలు నిర్మించాలనే సంకల్పంతో నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కాగా, కల్లూరుగూడెంలో కర్మాగారం నిర్మాణానికి రూ.60కోట్లు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేసినట్లు తెలిసింది. కర్మాగారంతోపాటు విద్యుదుత్పత్తి కేంద్రం కూడా నిర్మించనున్నారు. ఆయిల్‌పామ్ ఉప ఉత్పత్తుల ఆధారంగా విద్యుదుత్పత్తి చేయనున్నారు.

ఆదమరిస్తే అంతే..

- చాపకింద నీరులా విస్తరిస్తున్న ఎయిడ్స్ మహమ్మారి
- జిల్లాలో హెచ్ఐవీ బాధితులు 17,199
- ప్రతినెలా సగటున 40 కేసులు నమోదు
- నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 30: హ్యూమన్ ఇమ్యూనోడెఫిసియన్సీ వైరస్ (హెచ్ఐవీ).. చాప కింద నీరులా విస్తరించే ఈ మహమ్మారి నిశ్శబ్దం గా మనిషిని కబలిస్తుంది. ఈ వైరస్ మనిషి శరీరంలో ప్రవేశించిందని తెలుసుకోవడానికే ఎంతో కాలం పడుతుంది. క్రమంగా రోగ నిరోధక శక్తిని హరిస్తూ మనిషి క్షీణింపజేస్తుంది. రోగ నిరోధకశక్తి పూర్తిగా నశించినప్పుడు ఇతర వ్యాధుల బారిన పడి మనిషి మరణిస్తాడు. ప్రస్తుతానికి హెచ్ఐవీని నిర్మూలించే ఔషధాలు అందుబాటులో లేవు. కేవలం వైరస్ సోకిన వారిలో రోగ నిరోధక శక్తి తగ్గకుండా వైరస్‌ను అదుపులో ఉంచే మందులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అందువల్ల హెచ్ఐవీ విషయంలో అవగాహన, అప్రమత్తతే అసలైన మందుగా భావించాలి. ఎయిడ్స్ విస్తరణలో దేశంలో తెలంగాణ రాష్ట్రం రెండో స్థానంలో ఉండగా.. రాష్ట్రంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా 4వ స్థా నంలో ఉంది. మొదట హైదరాబాద్, రెండో స్థానం లో మహబూబ్‌నగర్ మూడోస్థానంలో రంగారెడ్డి జిల్లాలు ఉన్నాయి. గతంతో పోల్చితే జిల్లాలో కేసుల సంఖ్య కొంత తగ్గినా వైరస్ వ్యాప్తి పూర్తిగా అదుపులో లేదని గణాంకాలు తెలుపుతున్నాయి.



సమగ్ర కౌన్సెలింగ్, పరీక్ష కేంద్రాలు (ఐసీటీసీ)

హెచ్ఐవీ ఉన్నదీ లేనిదీ తెలుసుకోవడానికి రక్తపరీక్షలు చేస్తారు. ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, సత్తుపల్లి, మధిరలో ఈ కేంద్రాలు ఉన్నాయి. ప్రైవేటు ల్యాబ్‌ల వద్ద ఎయిడ్స్‌కు సింగిల్ కిట్ పరీక్షలు చేసి వైరస్ సోకింది లేనిది తేలుస్తారు. కానీ నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ బోర్డు నిబంధనల మేరకు రక్త పరీక్ష తర్వాత పాజిటీవ్ అని తెలితే మరో రెండు విడతల్లో పలు విధానాల పరీక్షలు చేసిన తర్వాతనే హెచ్ఐవీ గుర్తించిందని తేల్చాలని ప్రభుత్వ వైద్యులు చెబుతున్నారు. సక్రమంగా మందులు వాడటం తోపాటుగా మనోధైర్యం, సరైన పోషకాహారం తీసుకుంటే రోగికి 20ఏళ్ల వరకు ప్రాణాపాయం ఉండదని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ప్రతినెలా ఉచితంగా మందుల పంపిణీ


హెచ్ఐవీ రోగుల కోసం ప్రభుత్వం ఉచితంగా మందులను పంపిణీ చేస్తోంది.ఒక్కో రోగికి కనీసం 10 నుంచి రూ.12వేల విలువైన మందులు ఇస్తోంది. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ బోర్డు అధ్వర్యంలో ఉచితంగా ఖమ్మం జిల్లా ఆసుపత్రిలో ఈ మందులు అందజేస్తున్నారు.

భద్రాద్రి జిల్లాలో హెచ్ఐవీ పాజిటివ్ కేసులు ఇలా

ఏడాది	పరీక్షించిన వారి సంఖ్య	పాజిటివ్‌లు	శాతం
2018-19	79,206	410	0.52
2019-20	48,193	235	0.49
2020-21	60,387	268	0.44
2021-22	65,423	262	0.40
2022-23	96,145	329	0.34
2023-24	1,63,382	388	0.24

ఈ ఏడాది 12మంది గర్భిణులకు..

ఈ ఏడాది మాతా శిశు సంరక్షణలో భాగంగా జిల్లాలో గర్భిణులకు హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించారు. ఈ సమయంలో హెచ్ఐవీ నమోదైతే ముందస్తు ఆరోగ్య జాగ్రత్తల ద్వారా పుట్టబోయే బిడ్డ హెచ్ఐవీ తీవ్రతకు గురికాకుండా వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఖమ్మం జిల్లాలో ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు 17,628 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించగా వారిలో 12మందికి పాజిటివ్ తేలింది. వారికి సరైన వైద్యసేవలు అందిస్తూ పుట్టబోయే బిడ్డకు వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



బాధితులకు పింఛన్ పంపిణీ

హెచ్ఐవీ రోగులకు సమాజంలో సరైన గుర్తింపు ఉండటం లేదని భావించిన రాష్ట్ర ప్రభుత్వం వారికి ప్రతినెలా పింఛన్ అందిస్తోంది. జిల్లాలో 2,584 మందికి ప్రతినెల ఆసరా పింఛన్లు అందజేస్తోంది. ఎస్సీ బాధితులకు రూ.50వేల రుణాలను అందిస్తోంది. అంతేకాకుండా వారికి అంత్యోదయ రేషన్‌కార్డుల ద్వారా బియ్యం ఇతర సరుకులను అందిస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో హెచ్ఐవీ పాజిటివ్ కేసులు ఇలా

హెచ్ఐవీ పాజిటీవ్ పొందిన వారు	:	17,199
ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు కేసులు	:	285
ప్రతి నెల నూతన కేసులు	:	40
మహిళా సెక్స్ వర్కర్లు	:	1,788
స్వలింగ సంపర్కులు	:	727
ఎఫ్ఐసీటీసీ కేంద్రాలు	:	38
గర్భిణులు	:	12
ఏఆర్‌టీ సెంటర్ల నుంచి మందులు వాడేవారు	:	6,732
జిల్లాలో ఐసీటీసీ కేంద్రాలు	:	4
ఆసరా పింఛన్ పొందేవారు	:	2,780

హెచ్ఐవీ సోకుతుందిలా..

హెచ్ఐవీ వైరస్ గాలిలో వ్యాపించదు. ఇది ఒకరినుంచి మరొకరి సోకేందుకు పలు మార్గాలున్నాయి. అందులో ముఖ్యమైనవి హెచ్ఐవీ సోకిన వ్యక్తులతో నేరుగా లైంగిక సంబంధాలు నెరపడం, హెచ్ఐవీ ఉన్న వ్యక్తులు వాడిన సూదులు, సిరంజీలు, రేజర్లు, బ్లేడ్లు ఉపయోగించడం, హెచ్ఐవీ ఉన్న వ్యక్తుల రక్తాన్ని పరీక్షించకుండా ఇతరులకు ఎక్కించడం వంటి చర్యల వల్ల హెచ్ఐవీ ఒకరి నుంచి ఇంకొకరికి సంక్రమిస్తుంది. హెచ్ఐవీ సోకి న వ్యక్తి ఎంత త్వరగా ఏఆర్‌టీ(యాంటీ రెట్రోవైరల్) మందులు వాడితే అంత మంచిది. ఈ మందులు క్రమంతప్పకుండా వాడితే అందరిలాగే హెచ్ఐవీ రోగి కూడా సాధారణ జీవితం గడిపే అవకాశం ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో గత ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు 61,056 మందికి హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించగా 285మందికి పాజిటివ్ వచ్చింది. జిల్లావ్యాప్తంగా 17,199మంది హెచ్ఐవీ రోగులు ఉన్నారు.వారిలో ఇప్పటివరకు 3,500మంది మరణించినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

భద్రాద్రి జిల్లాలో హెచ్ఐవీ 0.24%

జిల్లాలో హెచ్ఐవీ పాజిటివ్ కేసులు గత కొన్నేళ్లుగా క్రమేపి తగ్గుముఖం పడుతుండటం మంచి పరిణామం. 2017-18లో 70శాతం ఉన్న పాజిటివ్ కేసులు క్రమంగా తగ్గుతూ 2023-24లో 0.24 శాతానికి తగ్గినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

భద్రాద్రి జిల్లాలో...

భద్రాచలం: ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి జిల్లాలో ప్రతి నెల కొత్తగా సుమారు 25హెచ్ఐవీ పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయని వైద్య వర్గాల అధికారిక లెక్కల ద్వారా తెలుస్తోంది. జి ల్లాలో ఐసీటీసీ కేంద్రాలు ఆరు, ఎఫ్ఐసీటీసీ కేంద్రాలు 46, ఏఆర్‌టీ కేంద్రాలు ఒకటి, లింక్ ఏఆర్‌టీ+ కేంద్రాలు ఒకటి, లింకు ఏఆర్‌టి కేంద్రాలు మూడు, సుఖ వ్యాధి కేంద్రాలు రెండు, రక్తనిధి కేంద్రాలు ఆరు, హెచ్ఐవీ నివారణ, నియంత్రణ కోసం పనిచేస్తున్నాయి. అయితే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు 87,923 మంది వ్యక్తులకు హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా 180 మందిని(0.2 శాతం) హెచ్ఐవీ పాజిటివ్‌లుగా నిర్ధారించడం జరిగింది. ఇందులో గర్భిణులకు 22,531 హెచ్ఐవీ నిర్ధారణ రక్త పరీక్షలు నిర్వహించగా ఐదు (0.02 శాతం)మంది హెచ్ఐవీ పాజిటివ్ లుగా నిర్ధారించడం జరిగిందని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. మొత్తంగా చూస్తే జిల్లాలో 14,718మంది హైరిస్క్ ప్రవర్తన కలిగిన వ్యక్తులు ఉన్నారు. ఇందులో ఫిమేల్ సెక్స్ వర్కర్లు 11,677, స్వలింగ సంపర్కులు 2,684, ట్రాన్స్‌జెండర్స్ 357 మంది ఇప్పటివరకు నమోదయ్యారు. వీరి కోసం గాడ్ థెరీసా మహిళ మండలి, సెక్యూర్ సంస్థ అనే స్వచ్ఛంద సంస్థ జిల్లాలో వారి ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి పని చేస్తున్నాయని అధికారు లు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, బూర్గంపాడు తదితర ప్రాంతాల్లో హెచ్ఐవీ పాజిటివ్ కేసులు వస్తున్నట్లు వైద్య వర్గాల పరిశీలన ద్వారా తెలుస్తోంది.

అవగాహన పెంచుతున్నాం

డాక్టర్ రామారావు, ఇన్‌చార్జ్ జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి



జిల్లాలో గతంలో ప్రతి నెల సగటున 40 కొత్త కేసులు నమోదయ్యేవి. ప్రజల్లో హెచ్ఐవీపై అవగాహన పెరిగింది. అయినా నెమ్మదిగా విస్తరిస్తూనే ఉంది. వీరిలో ఒకరిద్దరు గర్భిణులు కూడా ఉంటున్నారు. జిల్లాలో హైరిస్క్ ప్రవర్తన కలిగిన వారు 2వేల మంది ఉన్నారు. వీరికి అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఎవరికి వారు సురక్షితంగా లేని లైంగిక సంబంధాలకు దూరంగా ఉండాలి. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అవగాహన, ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించనున్నాం. హెచ్ఐవీ, సుఖ వ్యాధులు, స్వచ్ఛంద రక్త దానం ఇతర సమాచారం కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 1097ను సంప్రదించాలి. ఎన్ఏసీవో ఎయిడ్స్ ఏపీపీ అప్లికేషన్‌ను కూడా డౌన్‌లోడ్ చేసుకుంటే పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయి.

రూ 100.43 కోట్ల ధాన్యం చెల్లింపులు

- సన్నాలకు దక్కిన అదనపు ఆదాయం
- 431518 క్వింటాళ్లకు రూ 21.57కోట్ల బోనస్ అంజేచేత
- ముమ్మరంగా కొనుగోళ్లు, డీఎస్వో చందన్‌కుమార్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం సేకరణ ముమ్మరంగా సాగుతోంది. అయితే ఈ సారి ప్రభుత్వం రైతులకు సన్నధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 70,777.300 మె.టన్నుల ధాన్యాన్ని 334 కేంద్రాల ద్వారా సేకరించడగా వీటిలో 4,31,518 క్వింటాళ్ల సన్నధాన్యాన్ని సేకరించారు. దీనికిగాను ఇప్పటివరకు 6,593మంది రైతులకు రూ 21కోట్ల 57లక్షల 59వేల200ల బోనస్‌ను రైతులకు అదనంగా చెల్లించారు. ఖరీఫ్ ధాన్యం సేకరణకుగాను జిల్లాలో 334 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు పండించిన ధాన్యాన్ని సేకరిస్తున్నారు. నవంబరు రెండోవారం నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన అధికారులు రైతుల వద్ద ధాన్యంపూర్తి అయ్యేంతవరకు సేకరణ పూర్తి చేయాలన్న లక్ష్యంతో కొనుగోళ్లు ముమ్మరం చేస్తున్నారు. ఇతరప్రాంతాల నుంచి జిల్లాలోకి ధాన్యం రాకుండా నిరోధించడానికి 25వరకు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల ధాన్యాన్ని జిల్లాకు రాకుండా అడ్డుకోగలిగారు. అయితే కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు కాకుండా వ్యాపారస్తులు మంచి ధరను చెల్లించి ఆంధ్రాప్రాంతానికి తరలించినట్టు తెలుస్తోంది. వాస్తవానికి 5 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్ల లక్ష్యం పెట్టుకోగా శనివారం నాటికి 10వేల 329మంది రైతుల నుంచి 70,777.300 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. సేకరించిన ధాన్యానికిగాను రైతులకు రూ.100 కోట్ల 43లక్షలను చెల్లించారు. ఇంకా రూ.63కోట్ల 77లక్షలను చెల్లించాల్సి ఉంది. జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డీఎస్వో చందన్‌కుమార్ ఏరోజుకారోజు సమీక్షిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తు రైతులకు అవసరాలను అడిగి తెలుసుకుంటున్నారు. దీంతోపాటు ఈ ఏడాది ధాన్యంలోనూ తేమశాతాన్ని పరిశీలించడానికి గ్రామస్థాయిలోనే ప్రత్యేకంగా తేమ పరిశీలన కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు సేవ చేశారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లర్లకు రవాణా చేస్తున్నట్టు జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్ తెలిపారు. 69,250 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు సరఫరా చేశారు. ఈ సారి కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం రవాణాకు పకడ్బందీగా చర్యలు తీసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మిల్లర్లకు సాఫీగా రవాణా జరుగుతోంది.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి చందన్‌కుమార్

ముమ్మరంగా కొనుగోళ్లు,

చందన్‌కుమార్, డీఎస్వో, ఖమ్మం

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా చేస్తున్నాం. ఇప్పటివరకు సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు ఎప్పటికప్పుడు సరఫరా చేస్తున్నాం. ఎక్కడా ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టాం. ఈ సారి సన్నరకానికి ప్రభుత్వం ప్రకటించిన బోనస్‌తో రైతులకు మంచి మేలు జరిగింది. ఇప్పటివరకు రూ.21కోట్ల 57 లక్షల ను రైతుల ఖాతాలో జమచేశాం. ఎక్కడా చెల్లింపుల్లో జాప్యం జరగకుండా అన్ని చర్యలు చేపట్టాం. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు చెల్లింపులు కూడా 24 గంటల్లోనే ఖాతాకు జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభం

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాటేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నీస్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను నగర మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ క్రీడాకారులను పరిచయం చేసుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే ఆటల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఈ పోటీలకు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల నుంచి సుమారు 140 మంది క్రీడాకారులలు హాజరయ్యారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపికచేసి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్‌కుమార్, ఓలేటి సాంబమూర్తి, ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ ఉన్నారు.

కల్లలైన కలలు



ఖమ్మంలోని సాయితేజ ఇంటి వద్ద గుమిగూడిన జనం

(5వ పేజీ తరువాయి)

డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో అతడు తన జేబులో ఉన్న డబ్బు వారికి ఇచ్చేశాడు. అయినా వారు సాయితేజపై కాల్పులు జరపడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని అక్కడి పోలీసులు అతడి స్నేహితులతోపాటు సమీపంలో ఉంటున్న బంధువులకు తెలపడంతో వారు శనివారం తెల్లవారుజామున(భారత కాలమాన ప్రకారం) 6:30గంటల సమయంలో ఖమ్మంలోని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

ఈ విషయం తెలుసుకున్న బంధుమిత్రులు రాపర్తినగర్‌లో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వచ్చి ఓదార్చారు. మృతదేహాన్ని ఖమ్మానికి తీసుకువచ్చేందుకు తానా ప్రతినిధులను సంప్రదించడంతో వారు మృతదేహన్ని ఇక్కడికి పంపించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిసింది. ఈ ఘటన గురించి తెలియగానే ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, బీఆర్ఎస్ నాయకులు బెల్లం వేణు ఖమ్మంలోని సాయితేజ ఇంటికి వెళ్లి అతడి తల్లిదండ్రులను ఓదార్చారు. అనంతరం తానా నాయకులు అంజయ్య చౌదరి, శ్రీనివాస్, కొత్తపల్లి కిరణ్, కానురు హేమలతో మాట్లాడి మృతదేహం వీలైనంత త్వరగా ఖమ్మం వచ్చేలా కృషి చేయాలని కోరారు. మృతదేహం ఖమ్మం చేరుకునేందుకు గురువారం వరకు సమయం పడుతుందని తండ్రి తెలిపారు.

ఊరికే బయటకు వచ్చా

క్రిస్‌మస్ సందర్భంగా ఇక్కడ పండుగ వాతావరణంతో హడావుడిగా ఉందని, ఇప్పుడే కారులో బయటకు వచ్చానని సాయితేజ తండ్రి కోటేశ్వరరావుతో చివరిసారి మాట్లాడాడు. శుక్రవారం ఉదయం సాయితేజ ఫోన్ చేసి కొద్దిసేపు మాట్లాడినట్టు తండ్రి కోటేశ్వరరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అక్కడి విషయాలు కొద్దిసేపు మాట్లాడి తాను డ్రైవింగ్‌లో ఉన్నానని, బయటకు వెళుతున్నానని చెప్పడంతో తరువాత మాట్లాడతానని ఫోన్ పెట్టేశాడు. అదే అతని నుంచి వచ్చిన చివరి ఫోన్‌కాల్.

కేఎంసీలో ప్రక్షాళన చర్యలు

- అక్రమాలపై కమిషనర్ అగస్త్య ప్రత్యేక దృష్టి
- అక్రమార్కులు గుబులు



ఖమ్మం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): 'అవినీతికి అలవాలం.. అక్రమాలకు అడ్డా.. కొందరు అధికారులకు కామధేనువు.... మరికొందరు అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి అత్తారిల్లు.' ఇవి ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ (కేఎంసీ)పై కొన్నాళ్లుగా ఉన్న ఆరోపణలు. తరచూ వివాదాల్లోకి ఎక్కడం, విమర్శలకు గురికావడం కేఎంసీకి పరిపాటిగా మారింది. అయితే కొద్ది నెలల క్రితం కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అభిషేక్ అగస్త్య.. కేఎంసీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారా..? వివిధ విభాగాలలో అవినీతికి పాల్పడుతున్న వారిపై దృష్టి సారించారా? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. గత కొద్ది రోజులుగా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగులు పెడుతున్నాయి.

పలు అక్రమాలపై దృష్టి..

అభిషేక్ అగస్త్య.. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజుల వరకు కేఎంసీలో ఆయా విభాగాల పనితీరును నిశితంగా పరిశీలించారు. విభాగాలకు బాధ్యులుగా ఉండేవారు రెగ్యులర్ ఉద్యోగులు ఉండాలన్న నిర్ణయం తీసుకున్నారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వేరే బాధ్యతలు అప్పగించారు. తద్వారా విభాగాల ద్వారా జరిగే పనులు వేగంగా, బాధ్యతతో ప్రజలకు సేవలు అందించేలా చర్యలు చేపట్టారు. కొందరు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది నియామకాలు, వారి పనితీరుపై పలు ఆరోపణలు ఉండటంతో దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే గతంలో సుడా పరిధిలో స్టైనోగా చేరిన ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని సైతం పక్కనపెట్టినట్టు సమాచారం. అసలు సంబంధిత ఉద్యోగి చేరిన పనికి, చేస్తున్న పనికి పొంతన లేదన్న ప్రచారం జరిగిన నేపథ్యంలో సదరు ఉద్యోగికి సంబంధించిన టెక్నికల్ సర్టిఫికెట్లు అందించాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. డిజిటల్ విభాగంలో పనిచేస్తున్న మరో ఇద్దరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను మార్చడంతోపాటు, జవాన్లను సైతం మార్చారు.

కొద్ది రోజుల క్రితం శానిటేషన్ విజిట్‌లో భాగంగా అసిస్టెంట్ కమిషనర్ డివిజన్లకు వెళ్లిన సమయంలో.. ఓ ఉద్యోగి మూడు నెలల నుంచి విధులకు రావడంలేదని అక్కడ జవాన్ తన రిజిస్టర్‌లో నమోదు చేశారు. ఆ తర్వాత అసిస్టెంట్ కమిషనర్ సదరు ఉద్యోగి డివిజన్‌కు సంబంధించిన అటెండెన్స్ పరిశీలించగా, సదరు ఉద్యోగి మూడు నెలలుగా విధులకు హాజరైనట్టు చూపిస్తూ నేరుగా జీతాలు ఇచ్చినట్టు తేలింది. దీంతో అక్రమాలకు పాల్పడిన అధికారులు అడ్డంగా బుక్కయ్యారు.

ఈ క్రమంలో అవుట్‌సోర్సింగ్ వర్కర్లకు సంబంధించిన పూర్తి డేటా సేకరించే పనిలో ఉన్నతాధికారులు నిమగ్నమయినట్టు తెలిసింది. అవుట్‌సోర్సింగ్ వర్కర్లకు ఆ నెలలో దీపావళి పండుగ ఉండటంతో షరతులు విధిస్తూ బిల్లులు చేసినట్టు తెలిసింది. కాగా ప్రస్తుతం మళ్లీ నెలాఖరు కావడంతో ఆయా బిల్లులు చేస్తారో లేదో వేచి చూడాల్సి ఉంది. కాగా, రెవెన్యూ విభాగంలో అక్రమార్కులకు వంతపాడి కాసుల కక్కుర్తితో అసెస్‌మెంట్లు వేసిన వారిపై, టౌన్‌ప్లానింగ్ అక్రమ నిర్మాణాలకు అనుమతులు, నిర్మాణదారులకు వంతపాడిన సంఘటనలపై వచ్చిన ఫిర్యాదులకు అనుగుణంగా అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విజిలెన్స్ లేఖపై నోటీసులు

కార్పొరేషన్ కార్యాలయంలో ఇష్టారీతిగా అవుట్‌సోర్సింగ్ వర్కర్ల నియామకం జరిగిందని, 'ఐడీ గారడీ' ప్రదర్శించి ఇష్టారీతిన అవుట్‌సోర్సింగ్ వర్కర్లను నియమించుకున్నారనీ, అలాగే కొందరు ఇంటి దొంగలు అందినకాడికి దండుకుని అసెస్‌మెంట్లు వేశారంటూ ఆధారాలతో సహా 'ఆంధ్రజ్యోతి' పలు కథనాలను ప్రచురించింది. వీటిపై విచారణ నిర్వహించి చర్యలు చేపట్టాలంటూ ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయానికి విజిలెన్స్ రీజనల్ కార్యాలయం నుంచి లేఖ అందింది. దాంతో గతంలో ఇంటి నెంబర్లకు కేటాయించిన అసెస్‌మెంట్లకు సంబంధించి రిపోర్టు ఇవ్వాలంటూ సంబంధిత అధికారులకు నోటీసులు ఇచ్చినట్టు సమాచారం. కాగా కమిషనర్ ఇదే పరంపర కొనసాగించి కార్యాలయంలో పూర్తిస్థాయి ప్రక్షాళన చేస్తారా? లేదా? వేచి చూడాల్సిందే మరి.

అడ్డదారిలో రైట్ రైట్

(5వ పేజీ తరువాయి)

వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు పెద్దఎత్తున అక్రమంగా పత్తిని తరలించుకుపోతున్నారు. రాత్రివేళ చెక్‌పోస్టుల వద్ద రూ.100 నుంచి రూ.200 వరకు ముడుపులు ముట్టచెప్పి తీసుకుపోతున్నారు. కొంతమంది స్థానిక వ్యాపారులు కూడా రైతుల పేర్లతో పత్తి కొనుగోలు చేసి వే బిల్లులు లేకుండా రైతుల పేర్లతోనే సీసీఐకి పత్తిని విక్రయిస్తున్నారు.



ధాన్యం పరిస్థితి ఇంతే....

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ధాన్యం సీజన్ నడుస్తోంది. సాగర్ పరివాహక ప్రాంతంలోని మండలాలతో పాటు భద్రాచలం డివిజన్‌లోని చర్ల, దుమ్ముగూడెం, పినపాక నియోజకవర్గం లోని అశ్వాపురం, బూర్గంపాడుతోపాటు సత్తుపల్లి, వేంసూరు, కల్లూరు, తల్లాడ,కూసుమంచి, చింతకాని, బోనకల్ , మధిర, పెనుబల్లి, ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, వైరా తదితర మండలాల్లో ధాన్యం అధికంగా ఉత్పత్తి అవుతోంది. ఇటు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలతో పాటు ప్రైవేటు మిల్లర్ల కూడా ఉమ్మడిజిల్లాలో పెద్దఎత్తున ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. రోజు 50 నుంచి 100 లారీల వరకు ధాన్యం తరలిపోతోంది.

ఏపీలోని ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా, సూర్యాపేట జిల్లానుంచి కూడా మిల్లర్లు ఇక్కడి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కొన్ని వ్యాపారుల పేర్లతో కొనుగోలు చేసి మార్కెట్ సెస్‌తో పాటు సేల్స్‌ట్యాక్స్ కట్టి తీసుకెళ్తుండగా ఉమ్మడి జిల్లాకు చెందిన రైస్ మిల్లుల యజమానులు నేరుగా రైతుల పేర్లతో కొనుగోలు చేసి తరలించుకుపోతున్నారు. దీంతో మార్కెటింగ్‌శాఖకు సంబంధించి సేల్స్‌ట్యాక్స్ ఆదాయం తగ్గిపోతోంది.

ఇంటింటి కుటుంబ సర్వే పూర్తి

- గ్రామీణ ప్రాంతంలో 108.36 శాతం
- పట్టణ ప్రాంతంలో 104.26 శాతం
- ఇప్పటి వరకు 70 శాతం మేర ఆన్‌లైన్ లో నమోదు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో శుక్రవారం తో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పూర్తయిందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. జిల్లాలో 107.32 శాతం సర్వే జరిపినట్లు ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో 3 లక్షల 51 వేల 238 ఇళ్లకు గాను 3 లక్షల 80 వేల 616 ఇళ్లు సర్వే చేసి 108.36 శాతం పూర్తి చేసినట్లు వివరించారు. పట్టణ ప్రాంతలో ఒక లక్ష 20 వేల 231 ఇళ్లకు గాను ఒక లక్ష 25 వేల 354 ఇళ్లు సర్వే చేసి 104.26 శాతం అయినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కలిపి 4 లక్షల 71 వేల 469 హౌస్ లిస్టింగ్ చేసి మొత్తం 5 లక్షల 5 వేల 970 ఇళ్లను సర్వే చేసి 107.32 శాతం సర్వే పూర్తి చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. సర్వే చేసిన వివరాలను కూడా సమగ్రంగా డేటా ఎంట్రీ చేస్తున్న తెలిపారు. ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్ లో నమోదు చేసే ప్రక్రియ జరుగుతున్నట్లు, జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 70 శాతం వరకు వివరాలు ఆన్‌లైన్ లో నమోదు చేసినట్లు తెలిపారు. సర్వే చేసిన ఎన్యుమరేటర్ల ఆధ్వర్యంలో డేటా ఎంట్రీ ప్రక్రియచేపట్టినట్లు, సర్వే చేసిన ఎన్యుమరేటర్ పక్కన ఉండి ఆ వివరాలను ఆన్‌లైన్ లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌తో నమోదు చేయిస్తున్నట్లు వివరించారు. ఏలాంటి పొరపాట్లు లేకుండా డేటా ఎంట్రీ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.



సర్వే వివరాలు ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

యాసంగి యాక్షన్ ప్లాన్ సిద్ధం

(5వ పేజీ తరువాయి)

అధికమైంది. బోర్లు, బావుల్లో కూడా సాగుకు సరిపడా నీరు లభించనుంది. జిల్లాలోని ఏ మండలంలో ఎన్ని ఎకరాల పంటలు పండిస్తారనే విషయంలో అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.



వరి సాగుకే మొగ్గు..

యాసంగిలో ఖమ్మం జిల్లాలో అధిక రైతులు వరిని సాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. ఖమ్మం జిల్లాలో వరిని 2,14,892 ఎకరాల విస్తీర్ణంలో, మొక్కజొన్నను 91,227 ఎకరాలు, వేరుశనగ 744ఎకరాలు, పెసర 8,776ఎకరాలు, మినుములు 807ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనాలు తయారు చేసింది. కాగా యాసంగిలో ఎక్కువగా సాగు చేసే వరితోపాటు మొక్కజొన్న, జొన్న, వేరుశెనగ తదితర విత్తనాలు ప్రభుత్వం రాయితీని ప్రకటించలేదు. ప్రైవేటు వ్యాపారుల వద్ద విత్తనాలు కొనాల్సి ఉందని, వారు అధిక ధరలకు విక్రయిస్తే నష్టపోతామని రైతుల అభిప్రాయపడుతున్నారు. వర్షాకాలంలోనూ పచ్చిరొట్ట విత్తనాలను మాత్రమే ప్రభుత్వం రాయితీపై ఇచ్చింది. రైతులు వరిపై ఆసక్తి చూపుతుండగా అధికారులు మాత్రం పంట మార్పిడి చేయాలని, ఆరుతడి పంటలు పండించాలని సూచిస్తున్నారు. వానాకాలం వరికోతలు ఊపందుకొన్న నేపథ్యంలో విత్తనాలు అందుబాటులో ఉంచడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. యాసంగి సాగుకు కావాల్సిన ఎరువులపై కూడా అధికారులు దృష్టిసారించారు. యూరియా 25,745 మెట్రిక్ టన్నులు, డీఏపీ 15,581 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 15,581 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్సు ఎరువులు 30,924 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 27,776 మెట్రిక్ టన్నులు అవసరం అని అధికారులు అంచనా వేశారు.



కూడబెట్టుకున్న ఒక్కో రూపాయి వారికి భరోసా ఇస్తోంది.. జమ అవుతున్న నోట్లన్నీ ఆర్థిక పాఠాలు నేర్పుతున్నాయి.. అధికారంలో ఉన్న నాయకులు మార్గదర్శనం చేస్తున్నారు.. ఇంకేముంది ఖమ్మం జిల్లాలో స్వయం సహాయక పొదుపు సంఘాల మహిళలు ఆకాశమే హద్దుగా ఆలోచనలు చేస్తున్నారు. కిరాణ దుకాణాలు, కుటీర పరిశ్రమలు, టైలరింగ్, ఫ్యాన్సీ షాపులు, పచ్చళ్ల తయారీ, ధాన్యం, మక్కల కొనుగోలు దశ నుంచి ఏకంగా భారీ మిల్క్ డెయిరీ స్థాపనకు కార్యాచరణ చేశారు. అక్కడితో ఆగిపోకుండా సౌర విద్యుత్ కాంతులను పల్లెల్లో పంచేందుకు సోలార్ పవర్ ప్రాజెక్టు దిశగా కదులుతున్నారు. అంతేకాదు తెలంగాణ రోడ్డు రవాణా సంస్థకు బస్సులు కొనుగోలు చేసి అద్దెకు ఇవ్వడానికి కూడా ఆలోచనలు చేస్తున్నారు.

- ఆర్థిక సాధికారత దిశగా పొదుపు సంఘాల మహిళలు
- మధిరలో ఇందిరా డెయిరీతో ఆరంభం..
- జిల్లాలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అడుగులు
- ఆర్టీసీకి అద్దె బస్సులు ఇచ్చే దిశగా ఆలోచనలు...
- ఆర్థిక సాధికారక దిశగా సాగుతున్న డ్వాక్రా సంఘాలు

ఇంతి.. ఇంతింతై..

- ఆర్థిక సాధికారత దిశగా పొదుపు సంఘాల మహిళలు
- మధిరలో ఇందిరా డెయిరీతో ఆరంభం..
- జిల్లాలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అడుగులు
- ఆర్టీసీకి అద్దె బస్సులు ఇచ్చేదిశగా ఆలోచనలు...

ఖమ్మం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం జిల్లాలో 25వేల స్వయం సహాయక సంఘాలున్నాయి. 2.50లక్షల మంది సభ్యులున్నారు. బ్యాంకుల ద్వారా ప్రతీ సంవత్సరం సుమారు రూ.1100 కోట్ల రుణాలు తీసుకుంటూ జమచేస్తున్నారు. గతంలో ఉన్న వ్యాపారాలకు భిన్నంగా ఇప్పుడు పాల వ్యాపారం ఇందిరా డెయిరీ పేరుతో మధిర నియోజకవర్గంలో పెట్టబోతున్నారు. లక్షనుంచి 2లక్షల లీటర్ల పాల ఉత్పత్తి లక్ష్యంగా మొదటి విడతగా 20వేల మంది మహిళలకు ఎంపికచేసి ఇంటింటికి రెండు గేదెల చొప్పున అందిస్తున్నారు. ఈనెలాఖరులోగా బల్క్‌మిల్క్ ఫిల్లింగ్‌సెంటర్‌లు ఏర్పాటుచేసి ఇందిరాడెయిరీ పేరుతో ఇందిరమహిళ శక్తిని బలోపేతంచేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సొంత నియోజకవర్గం కావడంతో మధిరలో తొలిసారి ఇందిర డెయిరి ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. రోజుకు రూ.కోటి పాల వ్యాపారం నిర్వహించేదుకు మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలనసంస్థ ఆధ్వర్యంలో ఇందిర మహిళ శక్తి పథకం కింద ఇందిరా డెయిరీ ఏర్పాటుకు చకచకా చర్యలు సాగుతున్నాయి. దీనికి అనుగుణంగా జిల్లాలో ఇందిరా డెయిరీ పేరుతో పార్లర్ ఏర్పాటు చేసి పాల ఉత్పత్తులు అనుబంధ ఉత్పత్తులను కూడా విక్రయించబోతున్నారు. ఇందుకు ప్రత్యేకంగా మండల, జిల్లా కేంద్రంలో పార్లర్స్ ఏర్పాటుకానున్నాయి.

ఆర్టీసీకి అద్దె బస్సులు...

ఆర్టీసీలో కూడా కాంట్రాక్టు బస్సులు కూడా స్వయం సహాయకసంఘాల ద్వారా బస్సులు కొనుగోలు చేయించి మహిళల ద్వారా తిప్పేందుకు కూడా ప్రణాళిక సిద్ధమవుతోంది. ఆర్టీసీలో ఇప్పటికే హైర్ బస్సులు ఉన్నాయి. వాటి మాదిరిగానే మహిళా సంఘాలు కూడా బస్సులను కొనే విధంగా యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేస్తున్నది.

స్త్రీ టీ పేరుతో కూడా టీ షాపులు, టీపార్లర్లు కూడా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థనుంచి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. వీటితోపాటు మొబైల్ ఫిష్ షాపులు, ఇందిరా క్యాంటిన్లుకూడా మహిళల ద్వారా ఏర్పాటుచేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది.

సోలార్‌ప్లాంట్ల ఏర్పాటు..

రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు సౌరశక్తి పథకం కింద 90శాతం బ్యాంకు రుణాలతో సౌరవిద్యుత్ ప్లాంట్లను కూడా ఏర్పాటుచేయబోతున్నారు. విద్యుత్‌శాఖ మంత్రిగా ఉపముఖ్యమంత్రిగా ఉన్న భట్టి విక్రమార్క ఖమ్మంజిల్లాలో పవర్‌ప్లాంట్‌లను మహిళ సంఘాల ద్వారా ఏర్పటుచేయించేందుకు ఖాళీ స్థలాలను గుర్తించాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళ సంఘాలకు భూములు కేటాయించి బ్యాంకు రుణాలతో సౌర పవర్ ప్లాంట్లను ఏర్పాటుచేయించి ఆవిద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మోడల్‌గా ప్రతి మండల స్వయం సహాయక సంఘానికి ఒక పవర్‌ప్లాంట్ ఏర్పాటుచేయించి విద్యుత్ ఉత్పత్తి చేసి పవర్ వ్యాపారం ద్వారా ఆర్థికంగా స్వయంసహాయక సంఘాలు లబ్ధిపొందేలా కార్యాచరణ జరుగుతోంది.

ఖాళీ స్థలాల్లో సౌర ఫలకాలు

జిల్లాలోని ఖాళీ స్థలాలలో సోలార్ ఫలకాలు ఏర్పాటు చేసి నిర్వహణను స్వయం సహాయక సంఘాలకు అప్పగించనున్నారు. ఎన్నెస్పీ కాల్వమిగులుభూములతోపాటు చెరువు భూములు, కట్టలమీద, ఎన్నెస్పీ కట్టలపైనా వృథాగా ఉన్న ప్రభుత్వ భూములు, ప్రభుత్వ కార్యాలయ భవనాల పై భాగంలో సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయబోతున్నారు. దీనికి స్వయం సహాయక సంఘాల ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరిపేలా అధికారయంత్రాగం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఇప్పటి వరకు చిన్నచిన్న వ్యాపారాలు సాగిస్తున్న స్వయంసహాయక సంఘాలు ఇప్పుడు పాలు, సోలార్ పవర్ ప్లాంట్ల వ్యాపారంలో కూడా అడుగుపెట్టే అవకాశాలు లభించడంతో నిర్వాహణకు పలు స్వయం సహాయక సంఘాలు ముందుకు వస్తున్నాయి.



కొణిజర్ల ఐకేపీ కేంద్రంలో రైతులు ఆరబోయిన ధాన్యం

అన్నదాతల్లో 'ఫెంగల్' భయం

- తుఫాన్‌కు ధాన్యం తడుస్తుందేమోనని ఆందోళన
- కలవరపెడుతున్న వాతావరణం

ఖమ్మం వ్యవసాయం/ కొణిజర్ల, నవంబరు30(ఆంధ్రజ్యోతి): రైతుల్లో ఫెంగల్ తుఫాన్ ఆందోళన నెలకొంది. బంగాళాఖాతంలో తుఫానుగా బలపడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో పొరుగున్న ఆంధ్రప్రదేశ్‌లో అక్కడక్కడా జల్లులు పడుతుండటంతో ఖమ్మం జిల్లా రైతుల ఆందోళన చెందుతున్నారు. వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న దశలో ఉన్నందు భారీ వర్షం పడితే తీవ్రంగా నష్టపోతామని భయపడుతున్నారు. పొరుగు రాష్ట్రంలో ఫెంగల్ తుపాను ప్రభావంతో ఆకాశం మేఘావృతమై జల్లులు పడట ంతో రైతులు భయపడుతున్నారు. జిల్లాలో రెండు రోజుల నుంచి తుఫాను ప్రభావంతో వాతావరణం బాగా చల్లబడింది. జిల్లాలో ఇప్పటికే 40శాతం వరి కోతలు పూర్తయ్యాయి. జిల్లాలో పలు ప్రాంతాలలో కోతకు వచ్చిన పంట నేల వాలింది. దానిపై వర్షం పడితే మొలకలు వచ్చే అవకాశం ఉంది. పొలంలో వాన నీరు బయటకు వెళ్లకపోతే నష్ట తీవ్రత పెరుగుతుంది. వాతావరణం వర్షం వచ్చేలా కనిపిస్తుండటంతో రైలుతు కోతలు కోయకుండా యంత్రాల ద్వారా నూర్పిడి చేయిస్తున్నారు.

క్షణం క్షణం...భయం భయం

ఏ క్షణంలో వాతావరణం మారి వర్షం పడుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రాల వద్ద ఆరబోసుకున్న ధాన్యంపై పట్టాలు కప్పుకొని జాగ్రత్తపడుతున్నారు. తేమ శాతంతో కొర్రీలు పెడుతున్నారని, తడిస్తే ఇక మా పంట కల్లాల్లోనే ఉండాల్సిందేనని రైతులు బిక్కు బిక్కుమంటున్నారు. కొణిజర్ల మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 11 కొనుగోలు కేంద్రాలు, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఒకటి, సొసైటీ ఆధ్వర్యంలో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఇప్పటికే ఎనిమిదిలోడులు ఎత్తారు. 17శాతంలోపు తేమశాతం వస్తేనే కాంటా వేస్తున్నారని రైతులు తెలుపుతున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలో కొణిజర్ల, మల్లుపల్లి, గుబ్బగుర్తి, చిన్నమునగాల, పెద్దమునగాల, సింగరాయపాలెం, పెద్దగోపతి, తనికెళ్ల, కొండవనమాల గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను నడిపిస్తున్నారు. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లిలో కేంద్రాన్ని ప్రారంభించారు. సొసైటీ ఆధ్వర్యంలో లాలాపురం, గోపారం గ్రామాలలో ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.

క్రైం సమాచారం

పోలీసుల అదుపులో చోరీ నిందితుడు

మధిరటౌన్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): మధిర మండలంలో ఇటీవల వరుస దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని మధిర టౌన్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మూడు రోజుల క్రితం మధిర పట్టణంలో శ్రీనగర్ కాలనీలో రెండు ఇళ్లలో దొంగతనానికి యత్నించిన సంఘటన అక్కడ ఉన్న సీసీ కెమేరాలో రికార్డు అయ్యింది. అదే రోజు ఆత్కూరులో ఓ ఇంట్లో చొరబడి లక్షన్నర నగదు అపహరించడమే కాకుండా మరసటి రోజు మడుపల్లి లో ఓ ఇంట్లో చొరబడి రెండన్నర లక్షల విలువగల బంగారం, ఇరవై ఐదు వేల నగదును అపహరించాడు. పోలీసులు అనేక సీసీ పుటేజీలను పరిశీలించి ఈ వరస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి మధిర మండలం లోని మడుపల్లి గ్రామానికి చెందిన ఓ కారు డ్రైవర్ గా గుర్తించి అదుపు లోకి తీసుకున్నట్లు తెలుస్తుంది, విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు.

విద్యుత్‌షాక్‌తో మహిళకు తీవ్ర గాయాలు

ములకలపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ములకలపల్లి మండల కేంద్రంలో రింగిరెడ్డిపల్లి రోడ్డులో గల సంగు వెంకన్న ఇంటి వద్ద గల అరెటి చెట్టు వద్ద విద్యుత్‌వైర్లకు తీగలు తగిలి విద్యుత్ షాక్‌తో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. నరాటి వెంకట లక్ష్మి శనివారం కిరాణా సరుకుల నిమిత్తం షాపు వద్దకు రాగా తీగ పడటం వల్ల షార్ట్‌సర్క్యూట్‌తో స్పృహ తప్పిపడిపోయింది. హుటాహుటిన స్థానికులు కర్రతో తీగ తొలగించి తాడు సహాయంతో వెంకటలక్ష్మిని పక్కకు లాగి సీఆర్‌పీ చేసి స్పృహలోకి తెచ్చారు. వెంటనే వైద్య సహాయం నిమిత్తం మంగపేట పీహెచ్‌సీకి తీసుకువెళ్లి అక్కడ ప్రాథమిక వైద్యం అనంతరం పాల్వంచ ఏరియా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించారు.

సాగర్ కాల్వలో దూకి వ్యక్తి బలవన్మరణం

కూసుమంచి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో భార్య కాపురానికి రావటంలేదని మనస్తాపంతో సాగర్ కాల్వలో దూకి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన వెలుగు చూసింది. నేలకొండపల్లి మండలం భైరవునిపల్లి గ్రామానికి చెందిన గుడివాడ ఉపేందర్(35) అనేవ్యక్తికి కొంతకాలంగా మద్యం వ్యసనంగా మారింది. దీంతో భార్యతో తరచూ గొడవపడి కొడుతుండటంతో పుట్టిల్లు నాయకన్‌గూడెం వచ్చింది. దీంతో తిరిగి భార్యను తీసుకెళ్లేందుకు గత గురువారం ఉపేందర్ నాయకన్‌గూడెం గ్రామం వచ్చాడు. మద్యం సేవించి రావడంతో పాటు గొడవపడి కొడుతుండటంతో కాపురానికి వచ్చేందుకు నిరాకరించింది. దీంతో మనస్తాపం చెంది పక్కనే ఉన్న సాగర్ ఇన్‌ఫాల్ కాల్వలోకి దూకాడు. గాలింపు చర్యల అనంతరం పాలేరు జలాశయంలో శనివారం ఉదయం మృతదేహం లభ్యమవగా బయటకు తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు..

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న ఓ మహిళను అతిగా మద్యం సేవించిన యువకుడు ద్విక్రవాహనంతో ఢీకొన్న సంఘటన త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున జరిగింది. పట్టణంలోని పాత కొత్తగూడెం ప్రాంతానికి చెందిన పి.భవానీ మణుగూరు బీటీపీఎస్‌లో విధులు ముగించుకొని ఇంటికి వెళ్లేందుకు కొత్తగూడెం సూపర్‌బజార్ సెంటర్‌లో బస్సు దిగింది. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా అతిగా మద్యం సేవించిన ఓ యువకుడు తన ద్విచక్రవాహనంతో ఆమెను ఢీకొన్నాడు. తీవ్ర గాయాలు కావడంతో ఆమెను ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించారు.

బ్యాటరీలు దొంగిలిస్తూ పట్టుబడ్డ మహిళలు



దొంగతనం చేస్తూ పట్టుబడ్డ మహిళలు

దుమ్ముగూడెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రేగుబల్లి ఇసుక స్టాకు పాయింటు వద్ద నిలిపి ఉంచిన వాహనాల నుంచి శనివారం పట్టపగలే బ్యాటరీలను దొంగిలిస్తున్న ముగ్గురు మహిళలు పట్టుబడ్డారు. చెత్త ఏరే ముసుగులో ఆరు బ్యాటరీలను వాహనాల నుంచి తీసి తరలిస్తుండగా స్థానికులు పట్టుకున్నారు. అప్పటికే రెండు బ్యాటరీలను దాటించగా, మరో నాలుగింటిని తరలిస్తున్న క్రమంలో దొరికారు. కాగా కొద్ది రోజుల క్రితం ఇదే ప్రాంతంలో రెండు వాహనాల నుంచి నాలుగు బ్యాటరీలు చోరీకి గురయ్యాయి.

ఒక్కో బ్యాటరీ విలువ రూ.10వేల విలువ ఉంటుందని సమాచారం. బ్యాటరీలతో సహా దొంగతానికి పాల్పడిన మహిళలను స్థానికులు పోలీసులకు అప్పగించారు.

అక్రమ వ్యాపారులకు నోటీసులు

కారేపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఎలాంటి లైసెన్సులు లేకుండా అక్రమంగా వ్యాపారాలు సాగిస్తున్న పలువురు అక్రమ వ్యాపారులకు శనివారం వ్యవసాయశాఖకు చెందిన సిబ్బంది నోటీసులు అందచేసి కాటాలను స్వాధీనం చేసుకున్నారు. ఇల్లెందు వ్యవసాయ సాయశాఖ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బి.రాంబాబు ఆదేశానుసారం కాటాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు వారికి నోటీసులు అందజేశారు.



ఇల్లెందులో ఉర్స్ సరీఫ్ సందల్ ఊరేగింపు

ఘనంగా ఉర్స్ షరీఫ్ వేడుకలు ప్రారంభం

ఇల్లెందు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యం వెల్లివిరిసే ఇల్లెందు హజరత్ నాగుల్ మీరా ఉర్స్ షరీఫ్ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా ప్రారంభ మయ్యాయి. పట్టణంలో నెం.2 బస్తీ హజరత్ ఖాసిం దర్గాలో ప్రత్యేక పూజల అనంతరం చాదర్ సమర్పించారు. అనంతరం సందల్‌ను ప్రత్యేకంగా అలంకరించిన గుర్రాల బగ్గి వాహనంపై ఊరేగించారు. సత్యనారాయణపురం అటవీ ప్రాంతంలో ని. హజరత్ నాగుల్ మీరా దర్గాకు తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. దర్గా మాలిక్ లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో ఉర్స్ షరీఫ్ వేడుకలు ప్రారంభం అయ్యాయి.



సీఎం రేవంత్, వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతు సంక్షేమ ప్రభుత్వం

- పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాదు

దమ్మపేట, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమని రాష్ట్ర పామాయిల్ అడ్వైజరీకమిటి సభ్యుడు, పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాదు అన్నారు. గండుపల్లి రైతువేదిక వద్ద రైతు పండుగ సందర్భంగా శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి , వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటానికి రైతులు క్షీరాభిషేకం చేసారు. ఈసందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చుతుందన్నారు. రైతుల సంక్షేమ కోసం ఇచ్చిన హామీ మేరకు రెండులక్షల రుణమాఫీ, సన్నదాన్యానికి బోనస్ రైతు భరోసా వంటి కార్యక్రమాలు చేపడుతుం దన్నారు. రుణ మాఫీ, బోనస్ అమలు చేస్తుండగా రైతు భరోసా కార్యక్రమాన్ని సంక్రాంతి నుంచి ప్రారంభించటంపట్ల హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖా మంత్రిగా తుమ్మల బాధ్యతలు చేపట్టటంతో రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని, నష్టాలలో వున్న పామాయిల్ రైతులను ఆదుకునేందుకు తుమ్మల రాష్ట్రప్రభుత్వం ద్వారా కేంద్రప్రభుత్వానికి సమస్యను వివరించి చమురుపై దిగుమతి సుంకం పెంచటంతో పాటు పామాయిల్ గెలలధర 19వేలకు చేరిందన్నారు. పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కేంద్రప్రభుత్వం ద్వారా ఎంఎస్‌పీ అమలు చేసేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈకార్యక్రమంలో దమ్మపేట వ్యవసాయసహకారసంఘం అధ్యక్షుడు ఎల్లిన రాఘవరావు, మురళి, కొయ్యల అచ్యుతరావు, వాసం రాణిశ్రీను, కేవి సత్యనారాయణ, ఎర్రగొర్ల రాధాకృష్ణ, కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు పాల్గొన్నారు.

నేడు కార్తీక వన భోజనాలు

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా ఆదివారం పలు సంఘాల ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాల కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా నగరంలోని పలు తోటలు, వనాలు జనాలతో కళకళలాడ నున్నాయి. కార్తీక మాసం ముగియటంతో ఆదివారం చివరి సారిగా వన భోజనాల కార్యక్రమం జరుగనుంది. సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో కుల రహిత సకల జన భోజనాలు బల్లేపల్లిలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుకగల మలీదు జగన్ మామిడి తోటలో ఉదయం 10 గంటల నుంచి జరుగనుంది. కుల మతాలు సమసి పోయి ప్రజలంతా ఒక్కటే నినాదంతో మాస్‌లైన్ ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈసందర్భంగా ప్రజా కళాకారుల ఆట, పాట, అభ్యుదయ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ రెడ్డి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజన కార్యక్రమం మలీదు జగన్ మామిడి తోటలో జరుగనుంది. ఈ సందర్భంగా రెడ్డి ఉద్యోగుల ఆత్మీయ కలయిక నిర్వహించనున్నారు. విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాల కార్యక్రమం చెరుకూరి మామిడి తోటలో జరుగనుంది.

మెగా జాబ్ మేళాకు స్పందన

చుంచుపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు స్పందన లభించిందని జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్ శనివారం తెలిపారు. కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ (హైదారాబాద్) నిర్వహించిన ఈ జాబ్ మేళాలో మొత్తం 16 మంది హాజరయ్యారు. వీరిలో తొమ్మిది మంది నిరుద్యోగ అభ్యర్థులను ఎంపిక చేసినట్లు ఉపాధి కల్పన అధికారి తెలిపారు. నిరుద్యోగ అభ్యర్థులు అవకాశాలను వినియోగించుకొని ఉపాధి పొందాలని సూచించారు.

వైద్య శాఖలో పోస్టుల భర్తీ

చుంచుపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటలో మొబైల్ యూనిట్‌లో ఒక మెడికల్ ఆఫీసర్, ఒక పారామెడిక్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్ వివరాలు వెల్లడించారు. శనివారం ఐడీవోసీలోని తన కార్యాలయంలో ప్రధానమంత్రి జాన్ జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ భర్తీ చేపట్టినట్లు పేర్కొన్నారు. డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా ఎంపిక చేసి ఇద్దరికి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో డాక్టర్ బాలాజీ, సూపర్టెండెంట్ కె.సుదర్శన్, సీనియర్ అసిస్టెంట్‌లు రత్నరాజు, ప్రమీల, జూనియర్ అసిస్టెంట్‌లు రత్నరాజు, ప్రమీల, జూనియర్ దీపికా తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఆదివారం కొత్తగూడెం మొర్రేడు వాగు బ్రిడ్జి నుంచి రైల్వే స్టేషన్ వరకు అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీఎస్ఐ స్కూల్‌కు విద్యాశాఖ గుర్తింపు

దుమ్ముగూడెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగరం సీఎస్ఐ ప్రాథమిక పాఠశాలకు మండల పరిషత్ పాఠశాలగా గుర్తింపు దక్కినట్లు ఎంఈవో సున్నం సమ్మయ్య శనివారం తెలిపారు. సీఎస్ఐ యాజమాన్యం ఆధీనంలో ఉన్న ఈ పాఠశాలలో కొన్నేళ్లుగా రెగ్యూలర్ టీచర్లు లేక విద్యాబోధన కుంటుపడింది. దీంతో గ్రామస్థులు పలుమార్లు కలెక్టర్‌కు తమ సమస్యను వివరించడంతో ఆయన స్పందించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

సింగరేణి సమస్త సమాచారం మీ చేతుల్లోనే..

- క్యూఆర్‌కోడ్‌ను విడుదల చేసిన సంస్థ సీఎండీ బలరాం

కొత్తగూడెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణికి సంబంధించిన ప్రగతి, సంక్షేమం తదితర సమాచారం ఎప్పటికప్పుడు కార్మికులకు, ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు సింగరేణి ప్రజా సంబంధాలశాఖ వినియోగిస్తున్న అన్ని సోషల్‌మీడియా మాధ్యమాల క్యూఆర్ కోడ్‌లను సింగరేణి సీఎండీ ఎన్. బలరాం శనివారం సింగరేణి భవన్‌లో ఆవిష్కరించారు. ఈ క్యూఆర్ కోడ్లను స్కాన్ చేయడం ద్వార సింగరేణి ప్రజాసంబంధాల విభాగం నిర్వహిస్తున్న సోషల్‌మీడియా వేదికలైన ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ (గతంలో ట్విట్టర్), లింక్డ్ఇన్‌ల్లో సింగరేణి సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు. రాష్ట్రాభివృద్ధికి బొగ్గు, విద్యుత్ ద్వార సేవలు అందిస్తున్న సింగరేణి తన ఉద్యోగుల సంక్షేమం, కొత్త ఉద్యోగాల కల్పన, సామాజిక బాధ్యత కార్యక్రమాలు, నిరుద్యోగులకి ఉపాధి అవకాశం శిక్షణ రక్షణ, నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. ఈ విషయాలను ప్రతి ఒక్కరికి పారదర్శకంగా వివరించాలన్న ఉద్దేశంతో సింగరేణి సామాజిక మాధ్యమాలకు మరింత ప్రచారం, వినియోగం కల్పించడానికి క్యూఆర్‌కోడ్‌లు రూపొందించి విడుదల చేస్తున్నామన్నారు.

తోటి ఉద్యోగుల వేధింపులు తాళలేక

అధ్యాపకుడి ఆత్మహత్య

చుంచుపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తోటి ఉద్యోగులు వేధింపుల కారణంగా ఓ ప్రైవేటు పారా మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొత్తగూడెం టూటౌన్ సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం లోని రామవరం ప్రాంతానికి చెందిన లక్కినేని శ్రీనివాస్(48) గత ఇరవై సంవత్సరాలుగా స్థానికంగా ఓ పారా మెడికల్ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. అతడు కళాశాలలో మైక్రో బయాలజీ, పైథాలజీ, అనాటమీ సబ్జెక్టులు బోధిస్తాడు. అయితే గత కొంతకాలంగా కళాశాల యాజమాన్యం సరిగా జీతం చెల్లించడం లేదని శ్రీనివాస్‌కు పలుమార్లు కుటుంబ సభ్యులకు తెలిపాడు. ఇదిలా ఉండగా అతడు పనిచేస్తున్న కళాశాలకు అడ్మిషన్లు తీసుకొచ్చినా ఆఫీస్ సిబ్బందిలో ముగ్గురు ఉద్యోగులు సరిగా స్పందించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వారు తనపై కక్ష సాధిస్తున్నారని కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై గత సోమవారం క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాస్ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి, మాజీ సింగరేణి కార్మికుడు లక్కినేని మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్యతో పాటు, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రాష్ట్రపతి ఉత్తర్వులను అమలు చేయండి


- విశ్వహిందూ మహాసంఘ్ జాతీయ కో ఆర్డినేటర్

చంద్రుగొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గిరిజన పూజారులు నిర్వహించే ఆలయాలకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇచ్చిన ఉత్తర్యులను రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే అములు చేయాలని విశ్వహిందూ మహాసంఘ్ జాతీయ కోఆర్డినేటర్ మహత్ ముఖేష్ నాథ్ డిమాండ్ చేశారు. శనివారం చంద్రుగొండలో సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ మద్దిశెట్టి సామేలు ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల గిరిజన పూజారుల సభ జరిగింది. ఈ సభలో పాల్గొన్న జాతీయ కోఆర్డినేటర్ ముఖేష్ నాథ్, ఉపాధ్యక్షురాలు లక్ష్మి ఠాగూర్ మాట్లాడుతూ దేశంలో లక్షలాది గిరిజన పూజారులు నిర్వహిస్తున్న ఆలయాలకు ఆలనాపాలన లేదన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే

ధ్యేయంగా పనిచేస్తా

- పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్ రెడ్డి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

మధిర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే ఏ రాజకీయపార్టీ జెండా మోయనని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం మధిర వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు తనను గెలిపించి మండలికి పంపించాలని కోరారు.

విలేకరిపై కేసు నమోదు..

ఖమ్మం క్రైం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఓ విలేకరిపై రఘునాథపాలెం పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి కేసు నమోదైంది. ఐడీఓసీ ఆఫీస్‌లోని ఓ మహిళా అధికారి శనివారం మధ్యాహ్నం సమయంలో విధుల్లో ఉండగా ఖమ్మానికి చెందిన వెంకటేశ్వర్లు మరో వ్యక్తితో వచ్చి తాము ఓ పత్రికా విలేకరులమని, పర్సనల్‌గా తనతో మాట్లాడాలని చెప్పారు. తమ పత్రికలో ప్రకటన ఇవ్వాలని, అందుకు రూ. 10వేలను డిమాండ్ చేశారు. దానికి ఆమె అంగీకరించకపోవడంతో వాగ్వాదానికి దిగి అసభ్యకరంగా ప్రవర్తించి తన విధులకు ఆటంకం కలిగించారు. దీంతో ఆ అధికారి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు రఘునాథపాలెం ఎస్ఐ మహ్మద్ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.



14న జాతీయ లోక్అదాలత్



జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్

ఖమ్మంలీగల్ నవంబరు30(ఆంధ్రజ్యోతి): ఈనెల14న జాతీయ లోక్అదాలత్ నిర్వహిస్తున్నట్లు శనివారం జిల్లాప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ పేర్కొన్నారు. శనివారం ఆయన న్యాయాధికారులు, పోలీసు అధికారులు, ఇన్సూరెన్స్ కంపెనీ న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమం విజయవంతం చేయడానికి కృషిచేయాలని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సీపీ ఎస్.సునీల్దత్, న్యాయాధికారులు కె.వి. చంద్రశేఖరరావు, ఎం.కల్పన, కానరగడ్డ దీప, బిక్కమ్ రజని, ఏపూరి బిందుప్రియ, పీపీ శంకర్ పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	50 రూ.
వంకాయ	40
గుత్తి వంకాయ	50
బీరకాయ	58
పచ్చిమిర్చి	34
కాకరకాయ	28
బెండకాయ	24
పొట్లకాయ	40
దోసకాయ	28-48
చిక్కుడు	64
నాటుచిక్కుడు	120
గోరుచిక్కుడు	30
క్యాబేజీ	34
దొండ	38-44
సొరకాయ	20
క్యారెట్	48
క్యాప్సికం	44
ఆలుగడ్డ	34
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	185
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా

CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	మెకానిక్రాకీ
కేపీఎస్:	కేశవ చంద్రరమావత్
తిరుమల:	రోటీ కపడా రొమాన్స్
సినీ గెలాక్సీ:	జీబ్రా

నగరంలో నేడు

నేడు భలే మంచి రోజు

ఖమ్మంసాంస్కృతికం: భలేమంచిరోజు సంగీత విభావరి కార్యక్రమం ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 5.30కి జరుగనుంది. సినీ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా దాశరథి కృష్ణమాచార్యులుపై దాశరథి విజయలక్ష్మి చేసిన పరిశోధనాత్మక గ్రంథాన్ని ఆవిష్కరిస్తారు.

నేటినుంచి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ తరగతులు

ఖమ్మంటౌన్: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ 1,3,5 సెమిస్టర్ల, పీజీ ప్రథమ, ద్వితీయ సంవత్సర తరగతులు ఆదివారం నుంచి జరగనున్నాయి. ఈ మేరకు ఎస్ఆర్ బీజీఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ మొహ్మద్ జాకీరుల్లా ఓ ప్రకటన విడుదల చేశారు.

సూచికలు.. చూసేదెలా?

- ప్రధాన కూడళ్ల వద్ద వాహనదారులకు కానరాని సూచిక బోర్డులు
- పాతబడి, విరిగిపోయిన రేడియం స్టడ్స్
- రాత్రి సమయంలో కనపడక ప్రమాదాలు, పట్టించుకోని అధికారులు





ఖమ్మంక్రైం, నవంబరు30(ఆంధ్రజ్యోతి): నగరం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య కూడా అంతే పెరుగుతుంది. ఐదేళ్ల క్రితం నగరంలోని వంతెనల వద్ద రోడ్డును మళ్లించేందుకు రేడియంతో ఉన్న బోలార్డ్స్, రోడ్డు స్టడ్స్ను అధికారులు ఏర్పాటు చేశారు. ఇప్పుడు అవి పాతవైపోయాయి. సరిగ్గా కనపడటంలేదు. స్టడ్స్కు రేడియం స్టికర్లు పోయి రాత్రి వేళల్లో అవి కూడా సరిగ్గా కనపడటం లేదు. ఫలితంగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. విరిగిపోయిన బోలార్డ్స్కు మరమతులు నిర్వహించకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులకు గునవుతున్నారు.

రాత్రి సమయంలో ఇబ్బందులు

వాహనదారులకు రాత్రి సమాయాల్లో రోడ్డు దాటే ప్రాంతాలలో లైట్ వెలుతురుకు కనిపించే విధంగా రేడియం స్టడ్స్ను ఏర్పాటు చేశారు. బోలార్డ్స్ విరిగి పోయి వాటికి ఉన్న రేడియం స్టిక్కర్స్ పోవడంతో అవి సరిగా కనిపించక వాహనదారులకు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల నగరంలోని మయూరి సెంటర్ సమీపంలో ఓ ద్విచక్ర వాహనదారుడు బ్రిడ్జి దిగుతున్న సమయంలో స్టడ్స్ మార్జిన్ సరిగా కనపడక కిందపడి గాయాలుపాలయ్యాడు.



ప్రధాన కూడళ్ల వద్ద కనపడని సూచికలు

నగరంలో పలు ప్రధాన కూడళ్ల వద్ద సిగ్నల్స్ ఉన్నాయి. ట్రాఫిక్ ఎక్కువగా ఉంటున్న ప్రాంతాలలో సైతం అధికారులు ఏలాంటి సూచిక బోర్డులు కాని, స్పీడ్ బ్రేకర్లు కాని ఏర్పాటు చేయలేదు. ఫలితంగా రోడ్డు దాటి వెళ్లె వాహనదారులు ఇష్టమెచ్చినట్లు వెళుతున్నారు. నేరుగా వచ్చేవారు స్పీడ్గా రావడంతో ప్రమాదాలు జరగుతున్నాయి. జయనగర్ కాలనీ, బల్లేపల్లి, పాండురంగాపురం, ముస్తఫానగర్, ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతాలు, పలు కూడళ్ల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగి అనేక మంది మృతి చెందారు.

తెల్లవారుజామున అతివేగంగా..

తెల్లవారుజామున సమయంలో ఇల్లందు నుంచి వచ్చే వాహనాలు అతివేగంగా వెళుతున్నాయని పలువురు చెబుతున్నారు. తెల్లవారుజామున ఖమ్మం వచ్చే కూరగాయల వాహనాలు, ఆటోలు అతివేగంగా వెళుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సూచికతో బోర్డులు అయినా ఏర్పాటు చేయాలని స్థానికులు అంటున్నారు.

పదోతరగతి పరీక్షలో మెరుగైన ఫలితాలు సాధించాలి

- జిల్లా ఉపాధి కల్పనాధికారి మాధవి

ఖమ్మంటౌన్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): పదోతరగతిలో మెరుగైన ఫలితాలను సాధించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎన్.మాధవి సూచించారు. శనివారం ఆమె నగరంలోని రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. వారి లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. లక్ష్యం ఏర్పరచుకోవటమే కాకుండా దానిని సాధించేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. కష్టపడి, ఏకాగ్రతతో సాధన చేస్తే తప్పక ఫలితం వస్తుందన్నారు. 10వ తరగతి విద్యార్థులంతా వచ్చే వార్షిక పరీక్షలపై శ్రద్ధపెట్టి మెరుగైన ఫలితాలు సాధిస్తేనే లక్ష్యాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్ఛార్జ్ హెచ్ఎం. ఎస్కే.సోంద్, బీ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏడు లేఅవుట్లకు అనుమతి



లేఅవుట్లను పరిశీలిస్తున్న నగరపాలకసంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంటౌన్,నవంబరు30(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరపాలకసంస్థ కార్యాలయంలో నిర్వహించిన శనివారం నిర్వహించిన జిల్లా లేఅవుట్ అప్రూవల్ కమిటీ సమావేశంలో ఏడు ఫైళ్లకు అనుమతులు ఇచ్చారు. నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ మొత్తం 13ఫైళ్లు రాగా వాటిని పరిశీలించి అన్ని ధ్రువపత్రాలు ఉన్న ఏడుఫైళ్లకు ఆమోదం తెలిపామన్నారు. మిగతా వాటిని వివిధ శాఖల అధికారులకు పంపిస్తున్నామని, వారు ఎన్ఓసీ ఇస్తే వచ్చే సమావేశంలో పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టౌన్ప్లానింగ్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

క్రీడాకారిణులకు ట్రాక్సూట్ల అందజేత



క్రీడాకారిణులతో కలెక్టర్ ముజమ్మిల్ఖాన్

ఖమ్మంస్పోర్ట్స్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల కొంతకాలంగా సబ్-జూనియర్, సీనియర్స్ విభాగాల్లో పలు రాష్ట్ర, జాతీయ ఫుట్బాల్ టోర్నీల్లో రాణిస్తున్న జిల్లాకు చెందిన ఫుట్బాల్ క్రీడాకారిణులకు శనివారం కలెక్టర్ ముజమ్మిల్ఖాన్ ట్రాక్సూట్లను వితరణ చేశారు. సుమారు 40 మంది బాలికలకు రూ. లక్షన్నర విలువ చేసే క్రీడా దుస్తులతో పాటు, షూస్, క్రీడాపరికరాలను అందించారు. పోటీలలో రాణించి జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతిభ చూపే క్రీడాకారులను తనవంతుగా ప్రోత్సహిస్తానని అన్నారు. కార్యక్రమలో జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ కార్యదర్శి కళ్యాణపు ఆదర్శ్కుమార్ ఉన్నారు.

కొరియర్ కార్యాలయంలో చోరీ

ఖమ్మంక్రైం, నవంబరు30(ఆంధ్రజ్యోతి): నగరంలోని త్రీటౌన్ ప్రాంతంలో ఉన్న ప్రైవేటు కొరియర్ కార్యాలయంలో శనివారం చోరీ జరిగింది. కొరియర్ కార్యాలయం తాళాలు పగలగొట్టి గుర్తు తెలియని వారు సుమారు రూ.80వేలు చోరీ చేశారు. బాధితులు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమెదు చేశారు.

బంగారం కొనుగోలుదారులపై కేసు నమోదు

ఖమ్మంక్రైం, నవంబరు30(ఆంధ్రజ్యోతి): బంగారం తీసుకుని డబ్బులు చెల్లించని ముగ్గురు మహిళలపై ఖమ్మం త్రీటౌన్ పోలీస్ స్టేషన్లో శనివారం రాత్రి కేసు నమెదు అయ్యింది. గాంధీచౌక్లోని బంగారం దుకాణానికి కొద్ది నెలల క్రితం ఖానాపురానికి చెందిన గుడిపాటి కమల, జూలురుపాడుకు చెందిన ప్రశాంతి, తల్లాడకు చెందిన ధనలక్ష్మి వచ్చారు. తొలుత కొంతబంగారం కొనుగోలు చేసి డబ్బులు చెల్లించారు. కొద్ది రోజుల తరువాత కమల రూ.11.65లక్షలు, ప్రశాంతి రూ.16.55లక్షలు, ధనలక్ష్మి రూ.7.06లక్షల బంగారం కొనుగోలు చేశారు. డబ్బులు తరువాత ఇస్తామని చెప్పి వెళ్లారు. నెలలు గడుస్తున్నా వారు డబ్బు చెల్లించకపోవడంతో బంగారం షాపు యజమాని త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అష్టలక్ష్మి వైభవ దీపికోత్సవం

ఖమ్మంసాంస్కృతికం,నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం గాంధీచౌక్లోని వినాయక ఆలయంలో అష్టలక్ష్మి వైభవ దశాబ్ది ఉత్సవం శనివారం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం విశ్వరూప దర్శన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విష్ణుసహ్రనామం, వెంకటేశ్వర గానామృతం, సౌందర్య లహరి, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అన్నప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏబ్లాక్ అధ్యక్షుడు యర్రం బాలగంగాధర్ తిలక్, తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు దాణా వితరణ



దాణాను వితరణ చేస్తున్న స్తంభాద్రి సేవాసమితి సభ్యులు

ఖమ్మంటౌన్,నవంబరు30(ఆంధ్రజ్యోతి): నగరంలోని గొల్లగూడెంలో ఉన్న ఓం శ్రీకృష్ణ గోశాలకు స్తంభాద్రి సేవాసమితి ఆధ్వర్యంలో దాతల తరఫున శనివారం రూ.62 వేల విలువగల దాణాను వితరణ చేశారు. నగర పెద్దలు, దాల్మిల్ యజమానులు, మొక్కజొన్నల వ్యాపారులు, గోప్రేమికులు, సేవాసమితి సభ్యుల ద్వారా సేకరించామని సేవాసమితి కన్వీనర్ తూములూరి లక్ష్మీనరసింహారావుతెలిపారు. కార్తీక బహుళ అమావాస్య తిథిని పురస్కరించుకొని అందజేశారు.ఈ కార్యక్రమంలో గోశాల బాధ్యులు ఓంనారాయణ, కేసా హనుమంతరావు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్లు ఇప్పిస్తానని మోసం

ఖమ్మంక్రైం,నవంబరు30(ఆంధ్రజ్యోతి): డబుల్బెడ్రూం ఇళ్లు ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై ఖమ్మం ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్లో శనివారం రాత్రి కేసు నమెదు అయ్యింది. టేకులపల్లి డబుల్బెడ్రూం ఇళ్ల వద్ద నివసించే శివ రూ.1లక్ష చొప్పున అనేకమంది నుంచి డబ్బులు వసుల్ చేశాడు. ఏడాది దాటినా సరిగ్గా సమాధానం చెప్పకపోవడంతో ఐదుగురు బాధితులు శనివారం ఖనాపురం హవేలీ పోలీసులను ఆశ్రయించారు. వారు కేసు నమోదు చేశారు.

లెర్నెట్ స్కిల్స్ ఎన్జీవోతో ఎస్ఆర్బీజీఎన్నార్ ఒప్పందం

ఖమ్మంటౌన్,నవంబరు30(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల్లో విద్యార్థులకు, యువతకు ఉపాధి కల్పించేందుకు శిక్షణ ఇస్తున్న లెర్నెట్ స్కిల్స్ ఎన్జీవో సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఎస్ఆర్ బీజీఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ జకీరుల్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎంప్లాయ్బిలిటీ ఎన్హాన్స్మెంట్ ట్రైనింగ్ (గీట్) ద్వారా కళాశాలలో డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులకు 15 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతం

- వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన



నినాదాలు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఖమ్మంటౌన్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యాసంస్థల్లో కలుషిత ఆహారం వల్ల విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం పాఠశాలల బంద్ కార్యక్రమం నిర్వహించారు. తొలుత నగరంలో పెవిలియన్ గ్రౌండ్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వామపక్షాల విద్యార్థుల పిలుపుతో జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు మూతపడ్డాయి. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, పీడీఎస్యూ జిల్లా కార్యదర్శి వేంకటేష్, పీడీఎస్యూ జిల్లా కార్యదర్శి మస్తాన్ మాట్లాడారు. విద్యాశాఖకు మంత్రి లేకపోవటంతో విద్యార్థుల సమస్యలను పట్టించుకొనే వారే లేరన్నారు. సంక్షేమ గురుకులాల్లో మధ్యాహ్నభోజనం నాణ్యత లేని కారణంగా అస్వస్థతకు గురైన కొంతమంది విద్యార్థులు మరణిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. పురుగుల అన్నం, నీళ్లచారుతో పెట్టిన భోజనం చేయలేమని విద్యార్థులు ఆందోళన చేస్తూ రోడ్డపైకి వస్తున్నా ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నేతలు ప్రసాద్, నాగరాజు, బాలాజీగోపి,లక్ష్మణ్, యశ్వంత్, సాధిక్ పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్: వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల బంద్ రూరల్ మండలంలో విజయవంతం అయింది. ఎమ్ వెంకటాయపాలెం, తెల్దారుపల్లి, ఏదులాపురం, గోళ్లపాడు, జలగంనగర్, ముత్తగూడెం, తదితర పాఠశాలలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ విజయవంతం అయింది. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు, నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే నాయకులు, అధికారుల ఇండ్లను ముట్టడిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో గోపి, ఫ్రాన్సిస్, నగేష్ పాల్గొన్నారు.

డిసెంబరు మొదటివారంలో రైతుబజార్ను అందుబాటులోకి తేవాలి



పాత రైతుబజార్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంటౌన్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ఈనెల మొదటివారంలో పాతరైతుబజార్ మరమ్మతు పనులు పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని మేయర్ పునుకొల్లు నీరజ, 44వ డివిజన్ కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని 44వ డివిజన్లో జరుగుతున్న పాతరైతుబజార్ మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు సౌకర్యంగా ఉండేలా రైతుబజార్ పునర్ నిర్మాణం చేపట్టాలన్నారు. పనులు నాణ్యతతో చేయాలని కోరారు. త్వరితగతిని పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ వెంట మార్కెటింగ్ అధికారులు, నాయకులు పాలెపు వెంకటరమణ ఉన్నారు.

ఘనంగా కార్తీక వనసమారాధన

నేలకొండపల్లి,నవంబరు30(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం అక్కినేని గోపాలకృష్ణయ్య మామిడి తోటలో కార్తీక వనభోజనా నిర్వహించారు. ఉదయం మహిళలు ఉసిరి చెట్టుకు భక్తి, శ్రద్ధలతో పూజలు చేశారు. సర్వీస్ సొసైటీ సభ్యులతో పాటుగా అతిథులుగా హాజరైన వారు ఉదయం నుంచీ ఆటా, పాటలతో సందడి చేశారు. అనంతరం సామూహికంగా భోజనాలు చేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులతో పాటుగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



వనభోజనాల్లో భాగంగా ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

మంత్రిని కలిసిన డీలర్లు

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని సంఘం నాయకులు మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డిని కోరారు. శనివారం హైదరాబాద్లో పౌర సరఫరాల మంత్రిని కలిశారు. ఇటీవలె మున్నేరు వరదలకు తడిసిన రేషన్బియ్యాన్ని డీలర్లకు ఇవ్వాలని విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు, జిల్లా అధ్యక్షుడు బాణోత్ వెంకన్న,దొండ దుర్గయ్య, షేక్ జానిమియా, ఖమ్మం నగర అధ్యక్షుడు షేక్ ఇబ్రహీం, శేషగిరిరావు, వట్నాల బాబు, జానీ, ఉపేందర్, రహిమ, సీహెచ్ శ్రీను ఉన్నారు.

రైతుసంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

జిల్లా కాంగ్రెస్ నాయకుడు రామసహాయం నరేష్రెడ్డి

తిరుమలాయపాలెం, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం రైతుసంక్షేమానికి పెద్దపీట వేసి వారిని అన్నివిధాలా ఆదుకుంటుందని జిల్లా కాంగ్రెస్ నాయకుడు రామసహాయం నరేష్రెడ్డి పేర్కొన్నారు. సుబ్లేడగ్రామంలో శనివారం ఐకేపీ కేంద్రంలో రైతుపండగలో పాల్గొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు రుణమాఫీ చేశారన్నారు. అలాగే మరోమారు రైతులకు రైతులకు మాఫీచేసిందన్నారు. ఈకార్యక్రమంలో సీవో సత్యనారాయణ, వెంకటేశ్వర్లు,ఏఈవో బాలకృష్ణ, కాంగ్రెస్ నాయకులు సుమన్రెడ్డి పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: నాలుగో విడత రుణమాఫీలో భాగంగా శనివారం మండలంలోని దమ్మాయిగూడెంలో రైతువేదికలోరైతు పండుగ ఉత్సవం నిర్వహించారు. ఈ వేడుకలను అధికారులు, ప్రజాప్రతినిధులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏవో సీతారాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ బెల్లం శ్రీను, ఏఎంసీ వైస్చైర్మన్ వనవాసం నరేందర్రెడ్డి,ఉన్నం రాజశేఖర్ అరవిందరెడ్డి, యన్నం సుధాకర్రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ యూనియన్ ఆర్థికసాయం

ఖమ్మంచర్చికాంపౌండ్,నవంబరు30(ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఖమ్మం కార్పొరేషన్ టూవీలర్స్ యూనియన్ అధ్యక్షుడు వంగాల కొండల్రావుకు యూనియన్ మెకానిక్ సభ్యులు రూ.40వేలు శనివారం అందించారు. ఖమ్మంనగరంలోని సంఘం కార్యాలయంలో యూనియన్ తరుఫున సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నున్నా అప్పారావు, రమేష్, లింగనబోయిన మురళి, అన్వర్, భద్రం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వైరాలో అస్తవ్యస్తంగా అభివృద్ధి ప్రణాళిక

» విలువైన స్థలాల్లో ఇష్టానుసారంగా వాటర్ ట్యాంకుల నిర్మాణాలు

వైరా, నవంబరు30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ, మునిసిపల్, మండల నియోజకవర్గ కేంద్రమైన వైరాలో విలువైన స్థలాల విషయంలో అధికారులు అనాలోచిత నిర్ణయాలతో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి అడ్డంకిగా మారుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత కొన్నేళ్లుగా వైరాలో ఇదే తంతు జరుగుతుంది. ఏ కార్యక్రమానికైనా ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండా అప్పటికప్పుడు అందుబాటులో ఉన్న స్థలాల్లో నిర్మాణాలు చేపట్టి సమగ్ర అభివృద్ధిని నీరుగారుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు వైరాలో అమృత్-2 పథకం కింద చేపట్టిన వాటర్ ట్యాంకు నిర్మాణాల తీరు కూడా అలాగే ఉంది. ఎంతో ప్రజావసరాల కోసం వినియోగించాల్సిన విలువైన స్థలాలను అడ్డగోలుగా వినియోగించటంపై స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ కూడా తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

సంబంధిత శాఖకు సమాచారం కూడా లేకుండానే...

వైరా నడిబొడ్డున నీటిపారుదలశాఖ పరిధిలో ఎంతో విలువైన స్థలాలున్నాయి. అయితే ప్రభుత్వానికి ఏ అవసరం వచ్చినా కనీసం సంబంధిత శాఖకు సమాచారం ఇచ్చి వారి నుంచి స్వాధీనం చేసుకోవాలనే కనీస విధివిధానాలను పాటించకుండా ఆయాశాఖలు ఆస్థలాన్ని తాము స్వాధీనం చేసుకుంటూ నిర్మాణాలు చేపడుతున్నాయి. ఏకంగా జిల్లా కలెక్టర్లే రంగప్రవేశం చేసి సంబంధిత తహసీల్దార్‌కు స్థల సేకరణకు ఆదేశాలు ఇవ్వడం, ఆవెంటనే కళ్లముందు కన్పిస్తున్న ఐబీ స్థలాన్ని లాగేసుకోవడం పరిపాటిగా మారింది. ఐబీకి ఇంకా నామమాత్రం స్థలమే మిగిలింది. జిల్లా కలెక్టర్ ఆదేశాలంటూ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణాన్ని చేపట్టారు. అది ఇంకా పూర్తి కాకుండా దిష్టిబొమ్మలా దర్శనమిస్తుంది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఇదే స్థలంలో నిర్మించారు. గిరిజన భవన నిర్మాణాన్ని ఇదే స్థలంలో చేపట్టారు. అదీ అసంపూర్తిగానే ఉంది. మునిసిపల్, ఆర్‌అండ్‌బీ కార్యాలయాల భవనాలు, నీటిపారుదలశాఖ గోడౌన్, ఇండోర్ స్టేడియాన్ని ఈ స్థలాల్లోనే నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలో ఒక వాటర్ ట్యాంకును నిర్మించారు.



ఐబీ స్థలంలో వాటర్ ట్యాంకు నిర్మాణం కోసం తవ్విన గుంత

9లక్షల లీటర్ల సామర్థ్యంతో ట్యాంకు నిర్మాణం...

కేంద్ర మంచినీటి సరఫరా అభివృద్ధి పథకం(అమృత్-2) కింద వైరా మునిసిపాలిటీకి రూ.26.87కోట్లు మంజూరయ్యాయి. ఈ ఏడాది ఆగస్టు 9న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ పనులకు శంకుస్థాపన చేశారు. అమృత్-2లో 9లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన మూడు ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు, అలాగే పైపులైన్లు నిర్మించనున్నారు. ఇప్పటికే పూర్వపు మేజర్ పంచాయతీకి ప్రతి ఏటా రూ.25లక్షల ఆదాయాన్ని సంపాదించి పెట్టిన పశువుల సంత స్థలంలో 9లక్షల లీటర్ల సామర్థ్యంతో ఒక ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకును నిర్మిస్తున్నారు. ఇంతే సామర్థ్యం కలిగిన మరో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందున్న ఐబీ స్థలంలో నిర్మించే పనులు చేపట్టారు. బహుళ ప్రయోజనాల కోసం దీన్ని వినియోగించాలని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ భావిస్తున్నారు. అంతే కాకుండా ఈ ట్యాంకు నిర్మిస్తున్న స్థలంలో నుంచే జాతీయ ప్రధాన రహదారి నుంచి కూరగాయల మార్కెట్ రోడ్డును నిర్మించేందుకు ఎమ్మెల్యే మునిసిపల్ అధికారుల సమావేశంలో స్పష్టం చేశారు. అయితే అందుకు భిన్నంగా ట్యాంకు నిర్మాణ పనులు చేపట్టిన విషయం తెలిసిన ఎమ్మెల్యే మునిసిపాలిటీ వారిపై అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుకు వెనుకవైపున ఉన్న స్థలంలో ట్యాంకు నిర్మాణానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని కమిషనర్ వేణును ఎమ్మెల్యే ఆదేశించారు. ఒకవేళ అక్కడ సాధ్యం కాకపోతే వేరేచోట ట్యాంకును నిర్మించాలని, ఎంతో విలువైన ఐబీ స్థలంలో చేపట్టిన పనులను నిలిపివేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అధికారులు ఇకనుంచైనా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని స్థానికులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆధునిక విద్య

» ఐసీడీఎస్ వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మీబాయి



టీచర్లకు అవగాహన కల్పిస్తున్న ఆర్జేడీ ఝాన్సీ లక్ష్మీబాయి

కల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆధునిక సిలబస్ ద్వారా విద్య బోధనను అందిస్తున్నామని ఐసీడీఎస్ వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మీబాయి అన్నారు. శనివారం కల్లూరులోని అంబేద్కర్‌నగర్, ఖాన్‌ఖాన్‌పేటలోని పలు అంగన్‌వాడీలను తనిఖీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి నిర్మల జ్యోతి, సూపర్‌వైజర్లు భవాని, సంధ్యరాణి, టీచర్లు లక్ష్మిప్రసన్న, సావిత్రి, రాజకుమారి తదితరులున్నారు.

సత్తుపల్లిరూరల్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి) : పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తూ అంగన్‌వాడీ కేంద్రాలను పటిష్ఠంగా నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సీహెచ్.ఝాన్సీ లక్ష్మీబాయి తెలిపారు. శనివారం ఆమె సత్తుపల్లి పాతసెంటర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. స్టాక్, రికార్డులను తనిఖీ చేశారు. పిల్లల బరువు, అందిస్తున్న ఆహారం, హాజరు శాతం పరిశీలించారు. కార్యక్రమంలో సీడీపీవో కనకదుర్గ, సూపర్‌వైజర్లు రమాదేవి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పరిహార భూముల పరిశీలన

బోనకల్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబీరవల్లి గ్రామంలో శనివారం 190 సర్వే నంబర్‌లో భూమిని ఆర్డీవో నర్సింహారావు పరిశీలించారు. నాగపూర్ నుంచి అమరావతికి వెళ్లే గ్రీన్‌ఫీల్డ్ హైవే కింద భూ సేకరణ చేపట్టే భూములను ఆయన చూశారు. హైవే కింద భూములు కోల్పోయే ప్రతి రైతుకు పరిహారం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంట తహసీల్దార్ పున్నమ్ చందర్, ఆర్ఐ లక్ష్మణ్, ఎన్ఎస్‌పీ జేఈలు ఉన్నారు.

'ప్రజాపాలన విజయోత్సవాలను విజయవంతం చేయాలి'

వైరా, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాలు విజయవంతం చేయాలని మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ సూచించారు. శనివారం ఈనెల ఒకటి నుంచి తొమ్మిదో తేదీ వరకు మునిసిపాలిటీలో చేపట్టే ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాలపై మునిసిపల్ కమిషనర్ చింతా వేణుతో కలిసి సిబ్బందితో సమీక్షించారు. ప్రజాపాలన విజయోత్సవ సంబరాల్లో ప్రజలను భాగస్వాములను చేసి విజయవంతం చేయాలని సూచించారు. వార్డు ఆఫీసర్లు, కార్యాలయ, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన పెనుప్రమాదం

వేంసూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓ ద్విచక్రవాహనదారుడిని తప్పించబోయి ఆర్టీసీ బస్సు రోడ్డుపక్కకు దూసుకెళ్లిన సంఘటన వేంసూరులో శనివారం చోటుచేసుకుంది. విజయవాడ నుంచి సత్తుపల్లి వెళ్తున్న సత్తుపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు వేంసూరు సమీపంలో మలుపు వద్ద విసన్నపేటకు చెందిన శేఖర్ అనే వ్యక్తి బైక్‌పై రాంగ్‌రూట్‌లో అడ్డుగా రావడంతో డ్రైవర్ రోడ్డు పక్కకు బస్సును మళ్లించాడు. అయినప్పటికీ శేఖర్‌తోపాటు ద్విచక్రవాహనం బస్సు కిందకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో శేఖర్‌కు స్వల్పగాయాలయ్యాయి. అయితే బస్సు రోడ్డు పక్కకు వెళ్లిన ప్రదేశంలో విద్యుత్ స్తంభాలు ఉండటంతో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బ్రేక్ వేయడంతో పెనుప్రమాదం తప్పిపోయింది. బస్సు డ్రైవర్ కృష్ణను పలువురు ప్రయాణికులు అభినందించారు.

గేదెను ఢీకొట్టిన లారీ..గాయాలు

సత్తుపల్లిరూరల్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): స్థానిక తుమ్మూరు రామారావు రోడ్డుకు చెందిన మోరంపూడి సత్యనారాయణకు చెందిన గేదెలను ఇంటికి తోలుకెళ్తుండగా సుమారు రూ.లక్ష విలువ చేసే పాడిగేదెను అతివేగంతో వస్తున్న లారీ ఢీకొట్టి పరారైంది. గేదెను చికిత్స నిమిత్తం వెంటర్నరీ వైద్యశాలను తరలించారు. సదరు లారీ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

తల్లాడ, నవంబరు30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో, వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సత్తెనపల్లి నరేష్ అన్నారు. శనివారం వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెస్‌చార్జీలు పెంచాలని, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు గాజుల శశికుమార్, బొడ్డు చరణ్, కె.గోపి, ఎస్ఎఫ్ఐ నాయకులు కార్తీక్, ఉపేందర్ పాల్గొన్నారు.



ముదిగొండలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

మధిర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యాసంస్థలలో ఫుడ్ పాయిజనింగ్ వల్ల విద్యార్థులు చనిపోతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం మధిర నియోజకవర్గ వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ ఫుడ్ పాయిజన్ కారణంగా చనిపోయిన విద్యార్థుల గురించి పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గపాలన చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ నాయకులు కాంతి, సాయి, మణికంఠ, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మధిరలో.....

ముదిగొండ, నవంబరు30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ గత కొద్దిరోజులుగా గురుకులాల్లో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, నాగశ్రీను, రియాజ్, పండు, నాగరాజు పాల్గొన్నారు.

వైరా, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గురుకులాలు, హైస్కూళ్లలో విద్యార్థులు అర్థాకలితో ఎంతకాలం అలమటించాలని పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మందా సురేష్, జార్జిరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాలు తలపెట్టిన ప్రభుత్వ పాఠశాలల బంద్‌కు సంఘీభావంగా శనివారం వైరాలో పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆసంఘాల నాయకులు మొక్కా సురేష్, అజయ్, షకీల్, రోహిత్, సతీష్ పాల్గొన్నారు.

నేడు కల్లూరుకు మంత్రి తుమ్మల రాక

కల్లూరు, నవంబరు30(ఆంధ్రజ్యోతి): కల్లూరులో కమ్మసేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న కార్తీక వనసమారాధన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరు కానున్నట్లు సంఘం కమిటీ నాయకులు మద్దినేని రాధకృష్ణ, బొప్పన రామారావులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికంగా చంద్రుపట్ల రహదారి వైపున గల రమణయ్య మామిడి తోట ప్రాంగణంలో జరగనున్న మండల స్థాయి కమ్మ సామాజిక వర్గ వనసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మంత్రితో పాటు ఇరిగేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ మువ్వా విజయబాబులు పాల్గొననున్నారని వారు తెలిపారు.

సీపీఎం మధిర డివిజన్ సభను విజయవంతం చేయాలి

మధిర రూరల్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 8వతేదీన మల్లారం గ్రామంలో జరగనున్న సీపీఎం పార్టీ మధిర డివిజన్ మహాసభలను జయప్రదం చేయాలని ఆపార్టీ నియోజకవర్గ నాయకులు శీలం నర్సింహారావు, మందా సైదులు కోరారు. మల్లారం గ్రామంలో మహాసభలు నిర్వహించనున్న స్థలాన్ని శనివారం వారు పరిశీలించి మాట్లాడారు. సభకు సీపీఎం నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మందడపు ఉపేందర్, పడకంటి మురళీ, షేక్.ఉద్దండు సాహెబ్, నాగూల్‌మీరా, దస్తగిరి పాల్గొన్నారు.

ఇందిరానగర్ కాలనీలో తాగునీటి ఎద్దడి



ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

ఏన్కూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూతక్కలింగన్నపేట పంచాయతీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీవాసులు 20రోజుల నుంచి తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో సుమారు వెయ్యి మంది జనాభా ఉన్నారు. 20రోజుల క్రితం తాగునీటి సరఫరా చేసే ప్రధాన మోటారు కాలిపోయింది. అప్పటి నుంచి కాలనీవాసులు నీళ్లకోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా కూడా కావడంలేదు. దీంతో సమీప వ్యవసాయ మోటార్ల నుంచి, బోర్ల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. ఈవిషయమై స్థానికులు పంచాయతీ అధికారులకు విన్నవించగా గత రెండురోజుల క్రితం ఒక్కరోజు మాత్రమే ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేసి చేతులు దులుపుకున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలనిగ్రామస్థులు కోరుతున్నారు.

ఆరోగ్య శాఖలో ధనలక్ష్మి సేవలు మరువలేనివి



ధనలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

వైరా, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో 43సంవత్సరాల పాటు గుర్రం ధనలక్ష్మి అందించిన సేవలను నేటి వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది ఆదర్శంగా తీసుకోవాలని ఆశాఖ ఉద్యోగ సంఘాల నాయకులు సూచించారు. వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌వో) గుర్రం ధనలక్ష్మి ఉద్యోగ విరమణ వీడ్కోలు సభ శనివారం వైరాలోని కమ్మవారి కల్యాణమండపంలో జరిగింది. ధనలక్ష్మి, శ్రీనివాసరావు దంపతులను వైద్యఆరోగ్యశాఖ అధికారులు ఘనంగా సత్కరించారు వైరా పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ తాతా ఉదయలక్ష్మి, డి.అనంతరాములు, కొత్తా పుల్లయ్య, కొణిధన శ్రీనివాసరావు, గుంటుపల్లి శ్రీనివాసరావు, కట్టా సత్యనారాయణ, ప్రవీణ్, సీనియర్ జర్నలిస్టు పారుపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే మన కలలు సాకారం

» ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దొరల పాలన వద్దని ప్రజాప్రభుత్వం కాంగ్రెస్‌ను గెలిపించుకోవడంతో మన కలలు, ఆకాంక్షలు నెరవేరాయని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి అన్నారు. రైతు పండుగ మహోత్సవం సందర్భంగా మండలంలోని కొత్తూరు రైతువేదిక వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పుష్పాభిషేకం నిర్వహించారు. రాహుల్‌గాంధీ మాట ఇచ్చిన ప్రకారం రైతులందరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసి హామీ నిలుపుకున్నారని, మన రైతుల బాధలు, వెతలు గమనించి సోనియాగాంధీ సహకారంతో రైతులకు వరాలు జల్లు కురిపిస్తున్నందుకు ధన్యవాదాలు తెలపాలని కోరారు. బీఆర్ఎస్, బీజేపీ, మిగతా ప్రతిపక్షాలు కూడా ఆరోజు నమ్మలేదని, నిన్నమొన్నటి వరకు కాంగ్రెస్‌ను అవహేళన చేసుకుంటూ వచ్చారని, కానీ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా హామీలన్నిటిని ఒకొక్కటిగా అమలు చేసుకుంటూ ప్రభుత్వం వస్తుందన్నారు. పదేళ్ల నుంచి బీఆర్ఎస్ పట్టుమని రూ.1లక్ష రుణమాఫీ చేయలేకపోయిందని, మేమే రైతు ఆత్మబంధువులమని చెప్పుకున్న వారికి ప్రజలు ఎన్నికల సమయంలోనే తప్పా మిగతా సమయాల లోగుర్తుకు రారని, మిగతా సమయంలో ఫామ్‌హౌస్‌లో గడుపుతారన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏవో వై.శ్రీనివాసరావు, ఏఈవోలు నరేష్, ఆశాజ్యోతి, అనూష, వాసంతి, ట్రైనీ ఎస్ఐ నవిత, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, చల్లగుళ్ల నరసింహారావు, ఉడతనేని అప్పారావు, గాదె చెన్నారావు, రామ్మోహనరెడ్డి, సత్యనారాయణరెడ్డి, తదితరులు న్నారు.

కారేపల్లి, నవంబరు30(ఆంధ్రజ్యోతి): మండల పరధిలోని రొట్టమాకురేవు రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు పండుగలో ఏవో బట్టు అశోక్, సొసైటీ వైస్ చైర్మన్ ధరావత్ మంగీలాలు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తలారి చంద్రప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

వేంసూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో శనివారం రైతు సదస్సుకు సంబంధించి వేంసూరు రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో రామ్మోహన్‌రావు, రైతులు పాల్గొన్నారు.

తల్లాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో జరిగిన రైతు పండుగ వీడియో కాన్ఫరెన్స్‌ను శనివారం తల్లాడ రైతువేదికలో రైతులు, అధికారులు తిలకించారు. కార్యక్రమంలో ఏవో ఎండీ.తాజుద్దీన్, సొసైటీ చైర్మన్లు తూము వీరభద్రరావు, దిరిశాల నర్సింహారావు పాల్గొన్నారు.

తల్లాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతు పండుగను పురస్కరించుకొని శనివారం రాత్రి తల్లాడలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫ్లెక్సీకి మండల కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గంగదేవిపాడు సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరావు, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి పాల్గొన్నారు.

ఎర్రుపాలెం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మీనవోలు గ్రామంలో నిర్వహించిన రైతు పండుగలో ఏవో బి.సాయిశివ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బండారు నరసింహారావు,శీలం శ్రీనివసాఇరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తలపురెడ్డి నాగిరెడ్డి, అనుమోలు కృష్ణారావు, శీలం అక్కిరెడ్డి, బాబురావు, ,రాజీవ్‌గాంధీ, జానీబాషా, తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పుష్పాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో రైతు పండుగ సందర్భంగా పలువురు నాయకులు, రైతులు సీఎం రేవంతరెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంసీ చైర్మన్ బాగం నీరాజదేవి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు, ఏవో రూప, తోటకూర శేషగిరిరావు, కొండపల్లి శ్రీమన్నారాయణ, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, బాగం ప్రభాకరచౌదరి, ఏనుగు సత్యంబాబు, తక్కెళ్లపాటి ప్రసాద్, మట్టా రామకృష్ణ యస్‌కె ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.



కొర్లగూడెంలో....



ఎర్రుపాలెంలో సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న రైతులు



వేంసూర్‌లో...

విద్యార్థుల వనసమారాధన

కొణిజర్ల,నవంబరు30(ఆంధ్రజ్యోతి): కొణిజర్ల సూపర్‌జెమ్స్ పాఠశాల విద్యార్థుల వనసమారాధన శనివారం జరిగింది. బొట్లకుంట సమీపంలోని మామిడితోటల్లో విద్యార్థులు వనబోజనాల సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కొనతం ఉమాశంకర్ తదితరులున్నారు.

బోనకల్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయన్నపేట గ్రామంలో శనివారం బత్తినేని చారిటబుల్ ట్రస్టు సహకారంతో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వన భోజనాలకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో బత్తినేని ట్రస్టు డైరెక్టర్ తూము రోషన్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు ఇంటింటి సర్వే

ముదిగొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధి నిర్మూలన కోసం ఈనెల 2వతేదీ నుంచి 15వతేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీధర్‌స్వామి తెలిపారు. శనివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ సమావేశంలో నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణాదేవి, ఎంపీవో వాల్మీకి కిషోర్, సూపర్‌వైజర్ లత, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

వర్షపు జల్లులతో రైతుల్లో ఆందోళన



ధాన్యంపై పట్టాలు కప్పిన దృశ్యం

వేంసూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వేంసూరు మండలంలో శనివారం ఉదయం వర్షపు జల్లులు కురిశాయి. దీంతో ధాన్యం, పత్తి రైతులు ఆందోళనకు గురయ్యారు. రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు తమ పంటను కాపాడుకొనేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. వర్షపు జల్లులు కురవడంతో రైతులు తాత్కాలికంగా పట్టాలు కప్పి తమ ధాన్యాన్ని కాపాడుకున్నారు. ధాన్యంలో తేమ ఎక్కువగా ఉండటంతో పట్టాలు కప్పినప్పటికీ ధాన్యం పాడైపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

బోనకల్‌లో ఆన్‌లైన్ ప్రక్రియ 92 శాతం పూర్తి

బోనకల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో సమగ్ర కుల గణన సర్వే ఆన్‌లైన్ ప్రక్రియ 92శాతం పూర్తైందని తహసీల్దార్ ఏ. పున్నమ్ చందర్ తెలిపారు. మొత్తం 22 గ్రామ పంచాయతీలకు సంబంధించి 16,840 సర్వే ఫార్మట్లు రాగా, ఇప్పటి వరకు 15 వేల వరకు ఆన్‌లైన్ చేసినట్లు స్పష్టం చేశారు. ఆదివారం నాటికి వందశాతం పూర్తి చేస్తామన్నారు.

ఏన్కూరుకు చేరుకున్న ఉద్యమకారుల పాదయాత్ర

ఏన్కూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చి న హామీలను అమలు చేయాలని కోరుతూ సూర్యాపేట నుంచి భద్రాచలం వరకు ఉద్యమకారులు చేపట్టిన పాదయత్ర శనివారం ఏన్కూరుకు చేరింది. ఈసందర్భంగా స్థానిక ఉద్యమకారులు సంఘీభావం తెలిపారు. ఈకార్యక్రమంలో టీజేఎస్ జిల్లా కన్వీనర్ వర్దబోయిన బాబు, తెలంగాణ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అంజిరెడ్డి, కొవ్వూరి నాగేశ్వరరావు, గిద్దగిరి సత్యనారాయణ, గణేష్, పుణ్యం దేవదాసు, ఇటికాల రాజు, సాంబయ్య, ఎల్.నరసింహారావు, మోహన్‌బాష, సయ్యద్ పాషా, గోపి, గంగయ్య, రేణుక పాల్గొన్నారు.

కార్తీకమాస లక్షదీపోత్సవం

సత్తుపల్లి, నవంబరు30 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా అయ్యగారిపేటలోని గుడిపాడులో గల అతి పురాతన శివాలయంలో శనివారం నిర్వహించిన లక్షదీపోత్సవం కన్నులపండువగా జరిగింది. సంప్రదాయ దుస్తులు ధరించి ఆలయానికి చేరుకుని అమ్మవారు, శివలింగం ఇతర ఆకారాల చుట్టూ ప్రమిదలు ఏర్పాటు చేసి భక్తులు వెలిగించారు. పువ్వులతో ఓం, శ్రీ, స్వస్తిక్ వేసి దీపాలు పెట్టారు. ఈ సందర్భంగా దీప కాంతులతో దేవాలయం కొత్త శోభను సంతరించుకుంది.



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వైభవంగా శివుడికి అన్నాభిషేకం



స్వామి వారికి అన్నాభిషేకం చేస్తున్న అర్చకులు

కల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుల్లయ్యబంజరు గ్రామంలో శివాలయంలో (అప్పయ్య స్వామి) కార్తీక మాసం సందర్భంగా శనివారం వైభవంగా స్వామి వారికి మహా అన్నాభిషేకం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏఎంసీ చైర్మన్ బాగం నీరజాదేవి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాడిశెట్టి వెంకటేష్, మేనేజర్ ప్రసాద్, బాగం ప్రభాకరచౌదరి, తక్కెళ్లపాటి ప్రసాద్, కొండలు, నరిసింహారావు, వీరయ్య అర్జునరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.